

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి : 5 సంచిక : 199 మంగళవారం 30- 04 - 2024 ఎడిటర్ : బరిగెల శివ ■ పేజీలు : 9 ■ వెల : 5.00

పబ్లిషర్స్ : తెలంగాణ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూర్, తమిళనాడు చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్








## కేసీఆర్ నూరు అబద్ధాలు.. రేవంత్ వెయ్యి అబద్ధాలు



**సిద్దిపేట, జై భీమ్ న్యూస్**

గల్లీలో లేని ఢిల్లీలో లేని కారును గెలిపిస్తే మనకు మిగిలేది శూన్యమేనని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఎం. రఘునందనరావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నో రేవంత్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారని.. అయితే కొలువు తీరిన కాంగ్రెస్ సర్కార్ ఐదు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు.సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెదక్ పార్లమెంట్ కిసాన్ మోర్చా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రఘునందనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రిగా కేసిఆర్ నూరు అబద్ధాలు ఆడితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి అబద్ధాలు ఆడేందుకు సిద్దంగా ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు.కాంగ్రెస్ హయాంలో రైతులకు ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టిన విషయం మరవద్దంటూ ప్రజలకు రఘునందనరావు సూచించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడ ఎరువుల కొరత అనేదే లేకుండా చూశారని చెప్పారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను నరేంద్ర మోడీ నాయకత్వంలో పని చేసేందుకు పంపాలని ఈ సందర్భంగా ప్రజలకు రఘునందనరావు మనవి చేశారు.ఇక దుబ్బాక నియోజకవర్గం మీద బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి అవగాహన లేదన్నారు. ఆయనకు డబ్బులు పెట్టి ఓట్లు కొనడం మాత్రమే తెలుసునని చెప్పారు. ఓటర్లను బానిసలుగా చూసే సంస్కారం కొత్త ప్రభాకర్ రెడ్డిదని అభివర్ణించారు. ఎంపీ ఎన్నికలు పూర్తికాగానే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరడం ఖాయమని స్పష్టం చేశారు.



# ఉస్మానియాలో.. సెలవులు

- విద్యార్థులకు శాపంగామారిన సెలవులు.
- ఎన్నికలవేళ వీసీ కుట్ర
- ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా సెలవులు ప్రకటించడం దేనికి నిదర్శనం.
- ఉస్మానియా విశ్వవిద్యాలయ సెలవులకు నీటి కొరతే కారణమా?
- వీసీల పరిపాలనతో విసిగిపోతున్న విద్యార్థులు.
- నీళ్లు కరెంట్ కొరతగా చూపెడుతూ సెలవులు ప్రకటించడం సిగ్గుచేటు.
- విశ్వవిద్యాలయాలను సర్వనాశనం చేస్తున్న ప్రస్తుత వీసీలు
- వీసీల అవినీతి అక్రమాలపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలి
- పార్లమెంట్ ఎన్నికలవేళ విద్యార్థులను బలవంతంగా బయటకు గెంటిస్తున్నారు
- వీసీ అనుమతి లేకుండానే విద్యార్థులకు సెలవులు ప్రకటించిన హాస్టల్ వార్డెన్
- ఉద్యోగాలకోసం కఠోరంగా సిద్ధపడుతున్న విద్యార్థుల పరిస్థితిఏంది?
- ఉన్నత విద్యను రాజకీయాలు చేస్తున్న వీసీలు
- విద్య ప్రక్షాళనలో వీసీల మోసాలపై చర్యలుండాలి బరిగెల శివ.



**హైదారాబాద్(జై భీమ్ డెస్క్)**

రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యా నియమాలకు విరుద్ధంగా సెలవు దినాలు ప్రకటించారని బరిగెల శివ మండిపడుతున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మే 1వ తారీకు నుండి 31 మే వరకు సెలవులు ప్రకటించడం విడ్డూరంగావుందన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కాస్త కూస్తో ఉద్యోగాల నియామకాల ప్రక్రియలు చేపడుతూ నిరుద్యోగ యువతకు న్యాయం చేసే విధంగా బాటలు వేస్తున్న సందర్భంలో నిరుద్యోగ యువత ఆశయాలను నీరు గార్చేవిధంగా విశ్వవిద్యాలయాల వీసీలు కుట్రలుపన్నడం షారమాములైపోయిందన్నారుఅందులో భా గంగానే ఉస్మానియా విశ్వవిద్యాలయా హాస్టల్ వార్డెన్ మంచినీరు విద్యుత్ కొరతగా చూపిస్తూ హాస్టల్ సెలవు దినాలు ప్రకటించడం వింతగావుందన్నారు. విశ్వవిద్యా లయాల పురోగతి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా విశ్వవిద్యాలయాల ప్రక్షాళనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం కోసం రాష్ట్ర విద్యాశాఖను ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి తన చేతిలో ఉంచుకోవడం గర్వకారణమై నప్పటికీ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ ప్రక్షాళన జరగకపోవడం ఒకింత నీరసంగావుం దన్నారు. నిరుద్యోగులు కష్టపడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటే నిరుద్యోగుల ఉసురుపోసుకోవడం కోసం ఉన్నత విద్యను సమూలంగా నాశనం చేస్తూ ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్రలో భాగంగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో నియమించబడ్డ ప్రస్తుత వీసీలు ప్రభుత్వానికి తెలియకుండానే కుట్రలు పన్నుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారన్నది ఇటు ప్రభుత్వం కానీ అటు బాహ్య సమాజం కానీ గుర్తించలేక పోతుందన్నారు. అదే క్రమంలో ఎన్నికల నియమావళి మోడల్ ఆఫ్ కండక్ట్స్ పకడ్బందీగా కొనసాగుతున్న తరుణంలో పార్లమెంట్ ఎన్నికలవేళ ప్రభుత్వాన్ని బద్నాంచేసే కుట్రలో భాగంగానే విద్యార్థులకు సెలవు దినాలు ప్రకటించడం దానితోపాటు పలు విశ్వవిద్యాలయాల్లో అనుమతులు లేకుండా వందల మందితో సెమినార్లు నిర్వహించడం ప్రభుత్వ ప్రతిష్టతకు భంగం కలిగించేటువంటి కార్యక్రమాలు విశ్వవిద్యాలయాల వీసీలు చేస్తున్నకుట్ర దేనికి నిదర్శనమని మేధావి సంఘం ప్రశ్నిస్తుందన్నారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల ప్రక్షాలలో భాగంగా వీసీలు చేసిన కుట్రలను వీసీలు చేసిన మోసాలను వీసీలు చేసిన అవినీతి అక్రమాలను ఉన్నత స్థాయిలో వెలుగులోకి తెచ్చి కఠినంగా శిక్షిస్తే తప్ప రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం ఖాలేవన్నారు.అవినీతి అక్రమాల పట్ల నిజాయితీగా చర్యలు తీసుకుంటేనే విశ్వవిద్యాలయాల మనుగడను కాపాడినవాళ్ళవితారని మేధావి సంఘం ప్రభుత్వాన్ని కోరుతుంది. దానితోపాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాల యాల్లో నేటికీ నియామక ప్రక్రియలు జరగకుండా వీసీలు ఇష్ట రాజ్యాంగ దొడ్డిదారిన పార్ట్ టైం, కాంట్రాక్టు, అడ్జంట్,అధ్యాపకులను నియమించుకొని పలు అక్రమాలకు తెరలేపారన్నారు. వీటితోపాటు విశ్వవిద్యాలయాల్లో కొనసాగిన గతమూడు సంవత్సరాల పరిపాలనపై సమీక్ష సమావేశం నిర్వహించి వీసీల అవినీతి అక్రమాలు బయటపెట్టాలని విద్యార్థి లోకం ప్రభుత్వాన్ని కోరుతుంది.వీసీ రవీందర్, వీసీ రమేష్ ఇకనైనా సిగ్గుతెచ్చుకొని పాలనచివరి రోజుల్లో బుద్ధిమంతులుగా మెలగాలని మేధావి సమాజం హితవు పలుకుతుంది.

## ఎండ తీవ్రత అధికంగా ఉంది ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలి



**హైద్రాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో ఉదయం 9 గంటల నుంచే భానుడు తనఉగ్ర రూపాన్ని చూపుతున్నాడని, కూలీ పనులకు వెళ్ళే వారు త్వరగా పని ముగించుకుని ఇంటికి చేరుకోవాలని కోరారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని ప్రజలంతా మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పెరగుతున్న ఉష్ణోగ్రతలు వృద్ధులు, చిన్న పిల్లలపైన తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. తగిన జాగ్రత్తలు పాటించాలని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆవసరమైతెనే ఇండ్ల నుంచి బయటకు రావాలని లేక పోతే రావద్దని మంత్రి సూచించారు

# రేవంత్‌కు ఢిల్లీ పోలీసుల సమన్లు

- సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసుల నోటీసులు
- అమిత్ షా ఫేక్ వీడియో కేసులో పలువురికి సమన్లు
- మే 1న విచారణకు హాజరుకావాలన్న పోలీసులు



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్:**

మరి కొద్ది రోజుల్లో తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వందరోజుల పరిపాలనకు పార్లమెంట్ ఎన్నికలు రెఫరెండమని ప్రకటించారు. కచ్చితంగా 10 నుంచి 14 స్థానాలు గెలుస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారతీయ జనతా పార్టీపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. నరేంద్ర మోడీని ఉద్దేశించి ఆరోపణలు చేస్తున్నారు. గత కొద్దిరోజుల నుంచి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడినట్లుగా కొన్ని వీడియోలను స్పెక్యులేషన్ చేస్తోంది. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లను తొలగిస్తామని అమిత్ షా అన్నట్టుగా కొన్ని వీడియోలను విపరీతంగా ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం ఢిల్లీ పోలీసులు సమన్లు పంపారు. మే 1న విచారణకు రావాలని నిర్ణయించారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలను కూడా తీసుకురావాలని సూచించింది. హెూంత్వ శాఖ, బిజెపి చేసిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డి పై ఆదివారం కేసు నమోదు చేసిన విషయం విధితమే. పార్లమెంట్ ఎన్నికల ముందు ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డికి సమన్లు పంపడం చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ పోలీసుల బృందం చట్టంలోని నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.ఇటీవల అమిత్ షా తెలంగాణలో ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే రాజ్యాంగపరంగా ఉన్న ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేసింది. అయితే, అమిత్ షా చేసిన ప్రసంగాన్ని కొందరు వక్రీకరించారు. ఎస్సీ, టీ, బీసీలకు సంబంధించిన రిజర్వేషన్లను రద్దు చేసిన ఎస్టీ ఎడిట్ చేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనితో ఎన్నికల ముందు భారతీయ జనతా పార్టీ సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్ర హెూం శాఖ కూడా స్పందించింది. నకిలీ వీడియోలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎన్నికల సమయంలో కేంద్ర హెూం శాఖ మంత్రి మాట్లాడినట్లుగా కొందరు ఫేక్ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఇవి కలకలం సృష్టిస్తున్నాయి. ఏకంగా హెూం మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగిందంటే వారి పరిస్థితి 2లో..

## సీఎస్ ఫొటో డీపీగా పెట్టుకుని మోసాలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్ :**



సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకీ హద్దుమీరుతున్నాయి. మిలటరీ, పోలీస్ అధికారుల ఫొటోలు పెట్టుకుని ప్రజల్ని బురిడీ కొట్టించిన సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు తెలంగాణ సీఎస్ శాంతి కుమారి ఫొటోను తమ మోసాలకు వాడుకుంటున్నారు. కొద్ది రోజులుగా సీఎస్ ఫొటో డిస్‌ప్లే పిక్చర్(డీపీ)గా పెట్టుకుని అధికారులు, సామాన్య ప్రజలకు ఫోన్లు చేస్తున్నారు. కొందరికి ఫోన్లు, మరికొందరికి మెసేజ్‌లు పంపుతున్నారు. ఏకంగా సచివాలయ అధికారులకు ఫోన్ రావడంతో విషయం సీఎస్ వరకు వెళ్లింది. దీంతో సైబర్ మోసగాళ్ల పనే అని గుర్తించిన సీఎస్ శాంతికుమారి.. పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగాసిబ్బందిని ఆదేశించారు. కొద్ది రోజులుగా o977 984 4013103 నంబరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్లు, మెసేజ్‌లు చేస్తున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రేవంత్‌కు ఢిల్లీ పోలీసుల సమన్లు

మొదటిపేజీ తరువాయి

ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల తెలంగాణ లో అమిత్ షా మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న ముస్లిం ల రిజర్వేషన్లను రద్దు చేసింది. అయితే దీనిని కొందరు వక్రీకరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ల రిజర్వేషన్లు రద్దు అమిత్ షా చెప్పినట్టు ఫేక్ వాయిస్ తో ఎడిట్ చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. " తెలంగాణలో అమిత్ షా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉన్నారు. ఆ సమయంలో రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న ముస్లింల రిజర్వేషన్లు తొలగించామని స్పష్టం చేశారు. కానీ, కొందరు భారతీయ జనతా పార్టీపై విష ప్రచారం చేస్తున్నారు. ఎడిట్ చేసి వీడియోలను వ్యాప్తి చేస్తున్నారు. ఇది సమాజంలో హింసకు దారి తీసే అవకాశం ఉంది. ఇలాంటి ప్రచారం చేసేవారు చర్యలు ఎదుర్కోవలసి ఉంటుందని" బిజెపి ఐటి సెల్ వ్యాఖ్యానించింది. ఈ ఫేక్ వీడియోలపై కేంద్ర హెూంశాఖ మంత్రిత్వ శాఖ కూడా స్పందించింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## అబద్ధాల సీఎంను అరెస్టు చేయాలి



**సంగారెడ్డి, జై భీమ్ న్యూస్**

'ఫేక్ వీడియోల ఆధారంగా అబద్ధాలు ప్రచారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. గోబెల్స్ ప్రచారం చేసినందుకు వెంటనే పోలీసులు ఆయనను అరెస్టు చేయాలి' అని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం బీఆర్ఎస్ రోడ్‌షో నిర్వహించింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్ మాట్లాడుతూ.. ఫేక్ వీడియో ప్రచారంపై బుధవారం (మే 1న) ఢిల్లీ రావాలని అక్కడి పోలీసులు నోటీసులు ఇచ్చారని, రేవంత్ పాపం పండిందని అన్నారు. ఫేక్ వీడియోల ద్వారా అబద్ధపు ప్రచారం చేసినందుకు అస్సాంలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారని, అదే తరహాలో రేవంత్‌రెడ్డిని కూడా అరెస్టు చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయకపోతే ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసిపోయిన ట్టు తేలిపోతుందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌పైనా రేవంత్ అబద్ధాలు ప్రచారం చేశారని ఆరోపించారు. అబద్ధాల పునాదులపై రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొ చ్చారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ అన్నారు. ఎన్నికల ముందు ప్రామిసరీ నోట్లతో ఓట్లు వేయించుకొని మోసం చేసిన ఆ పార్టీ.. ఇప్పుడు గాడ్ ప్రామిస్‌లతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు రూ.2,500, రూ.4 వేల ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, నిరుద్యోగభృతి ఇస్తామని ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం గ్యారెంటీలను అమలు చేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రజల తరఫున పోరాడి ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలయ్యేలా చూస్తుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసే బలం వస్తుందని వెల్లడించారు. సంగారెడ్డి ప్రాంత ప్రజలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. మాజీ ఐఏఎస్ అయిన వెంకట్రామిరెడ్డి ప్రజల కోసం పనిచేస్తారని, రూ.100 కోట్ల ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి తీసుకువస్తారని వివరించారు. దేవుడిని అడ్డం పెట్టుకొని బీజేపీ అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దుబ్బాక ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చి ఒక్కటీ నెరవేర్చకుండా ఎమ్మెల్యేగా ఓడిపోయిన రఘునందన్‌రావు ఇప్పుడు కొత్త హామీలు ఇస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మెదక్ ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్‌షోలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, రాజేందర్, శివరాజ్‌పాటిల్, కోడూరి రమేశ్, చీలమల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌కు ప్లస్ అవుతుందా?



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

పింఛన్ల పంపిణీ మరోసారి జగన్ కు ప్లస్ గా మారనుంది. ఇంటికి తెచ్చే పింఛన్లు బ్యాంకుల్లో జమ చేస్తుండటం ఇందుకు కారణమని చెప్పాలి. నిజానికి ఫిబ్రవరి పింఛను వరకూ ఇంటికి తెచ్చి నగదును వాలంటీర్లు చెల్లించారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవ్వతాతలు తమ పింఛను కలిగి ఇంటివద్దనే అందుకున్నారు. కానీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వాలంటీర్ల పంపిణీపై నిమ్మగడ్డ రమేష్ కుమార్ చేసిన ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని ఆదేశాలు జారీ చేయడంతో ఏప్రిల్ నెల పింఛను పంపిణీలో జాప్యం జరిగింది. జాప్యం జరగడానికి మార్చి నెలాఖరు అని అధికారులు చెప్పినా పింఛనుదారులు వినిపించుకోలేదు.

**గ్రామ సచివాలయానికి**

మరోవైపు ఇంటి వద్దకు కాకుండా గ్రామ సచివాలయం వద్దకు వచ్చి పింఛన్లు ఏర్పాటు చేయడంతో అనేక మంది ఈ ఎండలలో ఇబ్బంది పడ్డారు. పింఛన్లు వచ్చి ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 32 మంది వృద్ధులు మరణించడంతో అది రాజకీయంగా పెద్ద రచ్చగా మారింది. అధికార తెలుగుదేశం పార్టీ ఇచ్చిన ఫిర్యాదు కారణంగానే వాలంటీర్ల చేత నగదు పంపిణీ జరగలేదని చెబుతోంది. అదే సమయంలో టీడీపీ సచివాలయం సిబ్బంది చేత పంపిణి చేయించాలని, వైసీపీకి ప్రభుత్వ అధికారులు సహకరిస్తున్నారంటూ ఆరోపణలు చేసింది. రాజకీయ ఆరోపణలు ఒకరిపై ఒకరు చేసుకున్నప్పటికీ చివరకు ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీ జరిగింది.

**మే నెల పింఛన్ల పంపిణీకి**

ఇప్పుడు మే నెల వచ్చింది. మే నెలలో ఇంటివద్దకు గాని, లేకుంటే నేరుగా బ్యాంకుల్లో జమ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ లో అరవై లక్షల మంది వరకూ పింఛను తీసుకునే వృద్ధులు, వికలాంగులు ఉన్నారు. వీరిలో దాదాపు నలబై ఐదు లక్షల మంది వరకు బ్యాంకుల్లో జమ చేయాల్సి ఉంది, మిగిలిన వారికి ఇళ్ల వద్దకు వెళ్లి అందించాలంటే బ్యాంకు అకౌంట్ లేని వారికి ఇంటివద్ద పింఛను చెల్లించాలని చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు కూడా విపక్షాలు అభ్యంతరం చెబుతున్నాయి. ఈ నెల పింఛను పంపిణీలో ఏ మాత్రం ఇబ్బంది తలెత్తినా అది తమ విజయంపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలో టీడీపీ ఉంది.

**బ్యాంకుల్లో జమ చేస్తే.**

బ్యాంకుల్లో నగదు జమ చేస్తే దానిని తీసుకెళ్లేందుకు బ్యాంకులకు వెళ్లాల్సి ఉంది. అది కూడా వృద్ధులకు సమస్యే. ఇంటి వద్దనే బ్యాంకులు ఉండవు. దానికి దూర వెళ్లి తెచ్చుకోవాల్సి ఉంటుంది. అందుకే ఇప్పుడు విపక్షాలు బ్యాంకుల్లో జమ చేయడాన్ని కూడా తప్పుబడుతున్నారు. నేరుగా ఇంటివద్దనే ఈ పింఛను చెల్లించాలని కోరుతున్నారు. కానీ బ్యాంక్ అకౌంట్లున్న వారికి మాత్రం బ్యాంకు అకౌంట్లలో జమ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అవ్వడం, పింఛను చెల్లింపునకు ఇంకా రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఇది విపక్షాలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విధానం కూడా వైసీపీకి వరంగా మారుతుందని. మరి మే 1వ తేదీన పింఛన్ల పంపిణీ ఎలా జరుగుతుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి ఉంది.

# ఉస్మానియా యూనివర్సిటీలో విద్యుత్తు, తాగునీటి కొరత అవాస్తవం



**- యూనివర్సిటీ విద్యార్థులు ఖాళీ చేయాల్సిన అవసరం లేదు, నిశ్చింతగా చదువుకోండి**

**- తప్పుడు ప్రకటన ఇచ్చిన అధికారికి షోకాజ్ నోటీసు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**హైదారాబాద్: (జై భీమ్ న్యూస్)**

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యుత్తు, తాగునీటి కొరత ఉందంటూ చీఫ్ వార్డెన్ తప్పుడు ప్రకటన చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యుత్తు, తాగునీటి కొరత అంటూ కొంతమంది ప్రకటనలు ఇవ్వడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో తాను విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. వెను వెంటనే విచారణ చేసిన అధికారులు విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయం లేదని ప్రాథమిక నివేదికలో స్పష్టం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తాగునీరు, విద్యుత్తు కొరత మూలంగా మే ఒకటి నుంచి, 31 మే వరకు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్లు, మెస్ లు మూసి వేస్తున్నట్టు చీఫ్ వార్డెన్ ఒక ప్రకటన చేశారని, దీంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైనట్టు గమనించి తమ ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లోని 33/11 కెవి సబ్ స్టేషన్ నుంచి రెండు ప్రత్యేక 11కేవి ఫీడర్ల ద్వారా నిరంతరం యూనివర్సిటీ మొత్తానికి విద్యుత్ సరఫరా జరిగిందన్న విషయం మీటర్ రీడింగ్ ల ద్వారా స్పష్టమైనట్టు అధికారులు వారి నివేదికలో పేర్కొన్నట్టు తెలిపారు. వాస్తవాలు ధ్రువీకరించుకోకుండా తప్పుడు ప్రకటన చేసిన చీఫ్ వార్డెన్ కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ద్వారా షోకాస్ నోటీసు జారీ చేసినట్టు తెలిపారు. యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. విద్యుత్తు, తాగునీటి సదుపాయాలను వెనువెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించామన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు ఏమాత్రం ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, నిశ్చింతగా యూనివర్సిటీలో ఉండి స్వేచ్ఛగా చదువుకోవచ్చు అన్నారు. ఖాళీ చేయాల్సిన అవసరం విద్యార్థులకు ఏమాత్రం లేదన్నారు. గత ప్రభుత్వం అలవాటు మాదిరిగానే ఈ ఏడాది అధికారులు ప్రకటన చేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గత ఏడాది జారీ చేసిన ప్రకటన తమ వద్ద ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

# రాష్ట్రంలో మాదిగలను బొంద పెట్టేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర

**హైదారాబాద్: (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో మాదిగలకు ఒక్క లోక్‌సభ సీటు ఇవ్వకుండా అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని ఓడించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. మాదిగలెవరూ కాంగ్రెస్‌కు పార్టీకి ఓటేయవద్దని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 14 ఎంపీ సీట్లు వస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మాదిగ జాతిని బొంద పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం లో 80 లక్షల జనాభా ఉన్న మాదిగలకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఎందుకు ఇవ్వలేదో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకే కుటుంబానికి మూడు సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. 'అన్ని సీట్లు మీ కులానికే ఇచ్చుకుంటే.. మిగతా జాతులు ఏం కావాలి? పార్టీ అధిష్ఠానం మిగతా కులాలకు ఇవ్వద్దని చెప్పిందా? ప్రజలకు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'రేపు పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు వస్తే మాదిగవాడు ఉండవద్దా? ఇది ఏ రకంగా సహించాలి. వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లోకి రాకుండా రేవంత్‌రెడ్డి భారీ కుట్రకు ప్లాన్ చేస్తున్నారు' అంటూ మోత్కుపల్లి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్‌కు సీటు ఇవ్వకుండా, బీఆర్ఎస్‌ను మోసం చేసి వచ్చిన కడియం శ్రీహరి బిడ్డ కడియం కావ్యకు వరంగల్ సీటు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని, యావత్ మాదిగ జాతి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. మే 4న ఇందిరాపార్క్ లేదా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద భారీ ధర్నా, నిరసన ప్రదర్శనలు చేస్తామని మాదిగలంతా లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ఎదుగుదలకు మాదిగలే ప్రధానపాత్ర పోషించారని స్వయంగా ఆయనే చెప్పారని



గుర్తుచేశారు. రాష్ట్రంలోని మూడు రిజర్వ్‌డ్ స్థానాలలో ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ చేసిన ద్రోహంపై రాష్ట్రమంతా యాత్రలు నిర్వహిస్తామని చెప్పారు. హనుమకొడ చౌరస్తా, ఏప్రిల్ 29: 'కడియం శ్రీహరి ఎస్సీనే కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ రోజుల్లోనే చెప్పాడు. ఇప్పుడు ఆయన బిడ్డ కడియం కావ్యకు టికెట్ ఇస్తే ఆమె ఎలా ఎస్సీ అవుతుంది. కావ్యకు రిజిస్ట్రేషన్ మ్యారేజ్ చేశారా..లేదా ముస్లింల ప్రకారం మతపెద్దలు నిఖా చేశారా కడియం శ్రీహరి బహిరంగంగా ప్రకటించాలి' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకఅధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 40 ఏళ్లుగా ఎస్సీ సర్టిఫికెట్‌తో దళితుల అవకాశాలు దోచుకున్న దోపిడీదారుడు కడి యం శ్రీహరి అని ధ్వజమెత్తారు. కావ్య ముస్లిం రిజర్వేషన్ ప్రకారం వివాహం చేసుకుంటే ఆమె ఎస్సీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. కావ్యకు పోటీ చేసే అర్హత లేదని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేత మందకుమార్ మాదిగ పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# ఉచిత వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జై భీమ్ న్యూస్**

జిల్లాలో ఉచితంగా అందించనున్న వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మే 3వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు శిక్షణ కొనసాగనుందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాలతో జిల్లా యువ జన క్రీడల శాఖ వారి ఆధ్వర్యంలో, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణ ప్రాంతములో వేసవి క్రీడా శిక్షణ శిబిరములో భాగంగా తేది: మే 03 నుంచి జూన్ 3వ తేదీ దాకా 2024. జిల్లాలో నీ బాల బాలికలకు ఈ క్రింది క్రీడాంశాలలో ఉచితముగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ విభాగాల్లో శిక్షణ..కరాటే, యోగ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, షటిల్ బాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్ బాల్. విలు విద్య (ఆర్చరీ)కబడ్డీ, అథ్లెటిక్స్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆయా క్రీడలో ఉదయము 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు అలాగే సాయంత్రం 5.00 గంటల నుంచి 7.00 గంటట వరకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ( నాన్ రెసిడెన్సియల్) సిరిసిల్ల పట్టణములోని రాజీవ్ నగర్, మినీ స్టేడియంలో కొనసాగుతాయని సూచించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 90594 65889, 75692 07411 లో సంప్రదించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్ కోరారు.



# ఇంటర్‌లో ఫెయిల్ అయినందుకు విద్యార్థిని ఆత్మహత్య

**మహబూబాబాద్ జిల్లా, జై భీమ్ న్యూస్**

నర్సింహులపేట మండలంలోని ఎర్రచక్రు తండాకు చెందిన గుగులోతు స్వాతి (17) అనే విద్యార్థిని ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పేలవడం తో మనస్థాపానికి గురై ఆత్మ హత్య చేసుకుంది. ఎర్రచక్రు తండాలో వ్యవసా య కూలి పనులు చేస్తూ జీవనం గడుపుతున్న గుగులోతు బీమా, పద్మల రెండవ కుమార్తె స్వాతి తొర్రూర్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివి ఇటీవలే పరీక్ష ఫలితాలు రావడంతో ఫెయిల్ అని తెలవడంతో మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మహ బూబాబాద్‌లోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న క్రమంలో సోమ వారం ఉదయం తుది శ్వాస విడిచింది. విషయం తెలుసుకున్న మహబూ బాద్ జిల్లా బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత మృతదే హాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బెల్ట్ షాప్‌లపై ఉక్కుపాదం

**వేములవాడ, జై భీమ్ న్యూస్**



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ,పట్టణాల్లో ఉన్న బెల్ట్ షాప్ ల పై దాడులు నిర్వహించి 55 కేసులల్లో 31,2,374/- రూపాయల విలువ గల 584 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందని అన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 68 కేసులల్లో 255500 /- రూపాయలు విలువ గల 417 లీటర్ల మద్యం సీజ్ చేసి ఉక్కుపాదం మోపడం జరిగిందని తెలిపారు.గ్రామాల్లో, పట్టణాల్లోని ఇండ్లలో, హెూటల్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో, ఇతర దుకాణాలలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ప్రభుత్వ పర్మిషన్ లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,వైన్స్ యజమానులు కూడా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వాహకులకు మద్యం విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరించారు.

# వృద్ధ దంపతులకు చేయూత అందిద్దాం

**వేములవాడ, జై భీమ్ న్యూస్**

జగిత్యాల జిల్లా కొండాపూర్ గ్రామానికి చెందిన ఘపూర్ షా, ఖాసీమ్ బీ అనే ముస్లిం వృద్ధ దంపతులు వీరు గత 30 సంవత్సరాల నుండి వేములవాడలో యాచకవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చుట్టుపక్కల వారు తెలియజేశాని వీరు ఆర్ఆర్ వాటర్ ప్లాంట్ వెనుక వైపు గల సందులో చిన్న రేకుల షెడ్డులో కిరాయికి ఉంటున్నారని, వీరికి ఉండడానికి ఇల్లు లేదని, వృద్ధాప్య పెన్షన్ కూడా రావడం లేదని మొన్న శాసనసభ ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ వచ్చి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని అన్నారని వృద్ధ దంపతులు తెలియజేశారు. వీరికి గత మూడు నాలుగు రోజుల నుంచి అన్నం ప్యాకెట్లు వృద్ధ దంపతులకు దాతల సహకారంతో అందించిన టువంటి ఆహారాన్ని వారికి అందజేయడం జరిగిందని, ఇక నుండి ప్రతీరోజు వారికి ఆహారం అందజేయడం జరుగుతుందని, మన పరిసరాల్లో ఎవరైనా అనాథ వృద్ధులు ఉంటే ట్రస్టుకు సమాచారం అందిస్తే వారికి కూడా ప్రతీరోజు అన్నం అందజేయడం జరుగుతుందని ట్రస్టు నిర్వాహకులు తెలియజేశారు.

# మెప్మా ఆధ్వర్యంలో ఓటరు చైతన్య అవగాహన



**హన్మకొండ జిల్లా, జై భీమ్ న్యూస్**

కుమార్‌పల్లి, రెడ్డి కాలనీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్విప్ కార్యక్రమంలో భాగంగా ఓటరు చైతన్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు కలిసి ఇంటింటా తిరుగుతూ ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ బద్రు నాయక్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మేన శ్రీను, మెప్మా డీఎంసీ రజిత రాణి, ఏడిఎంసి వెంకట్, సీఓలు స్వాతి, సునీల్, ఆర్పీలు, పాల్గొన్నారు.

# లక్ష్యం మేరకు సీఎంఆర్ ఇవ్వాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జై భీమ్ న్యూస్**

నిర్దేశించిన లక్ష్యం మేరకు సీఎంఆర్ ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. 2023–24 ఖరీఫ్ సీఎంఆర్ ఎఫ్సీఐ కి ఇవ్వడంపై జిల్లాలోని 68 రా రైస్ మిల్లుల యజమానులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రా రైస్ మిల్లులకు ఇచ్చిన ధాన్యం వివరాలు తెలియజేస్తూ ఇప్పటిదాకా ఎంత సీఎంఆర్ ఇచ్చారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. 2023–24 ఖరీఫ్ సీజన్లో ఆయా రా రైస్ మిల్లులకు కలిపి మొత్తం 1,44,571 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చామని, 96,690 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. ఎఫ్సీఐ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలతో



సీఎంఆర్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటిదాకా సీఎంఆర్ ఇవ్వని రైస్ మిల్లుల జాబితా తయారు చేయాలని సూచించారు. వారం తరువాత కూడా సీఎంఆర్ ఇవ్వకపోతే వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అయినా మార్పు రాకపోతే ఆయా మిల్లుల బ్లాక్ లిస్ట్ లో పెట్టి సీజ్ చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. అనంతరం రైస్ మిల్లర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కుతాడి తిరుపతి ని ఘనంగా సన్మానించిన ఇంపాక్ట్ ట్రైనర్స్



**కరీంనగర్ జిల్లా, జై భీమ్ న్యూస్**

కరీంనగర్‌లోని వి కన్వెన్షన్‌లో జరిగిన ఇంపాక్ట్ ట్రైనింగ్ ది ట్రైనర్స్ వర్కుషాప్ ప్రోగ్రాంలో టిటిటిడబ్ల్యూ ఎస్146 బ్యాచ్ గ్రూప్ సభ్యులు తమకు కో ఆర్డినేటర్ గా ఉంటూ ట్రైనింగ్ టైమ్ లో ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్నా తగిన సలహాలు ఇస్తూ ఒక పర్ఫెక్ట్ వ్యక్తిత్వ వికాస నిపుణుడికి కావలసిన లక్షణాలు ఎలా ఉండాలో తమకు క్షుణ్ణంగా అర్థం అయ్యేలా వివరిస్తూ తమని ట్రైనర్ లు గా తీర్చిదిద్దడంలో కృషి చేసినందుకు కుతాడి తిరుపతి ని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా కుతాడి తిరుపతి మాట్లాడుతూ ఇంపాక్ట్ లో ట్రైనింగ్ ది ట్రైనర్స్ వర్కుషాప్ పూర్తి చేసుకున్న వారిని కొనియాడారు, గంపా నాగేశ్వర్ రావు స్థాపించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ లో ట్రైనింగ్ తీసుకున్న నేను ఇంకా ఎంతో మందికి ట్రైనింగ్ ఇస్తూ ఎంతో మంది ట్రైనర్ లను తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఇప్పుడు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ప్రతీ ట్రైనర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించడమే కాకుండా ఒక్కో ట్రైనర్ ఒక్కో ప్రభుత్వ పాఠశాలను, కళాశాల ను దత్తత తీసుకొని ఆ పాఠశాల లేదా కళాశాల విద్యార్థుల అభివృద్ధి కి పాటుబాడాలని కోరారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఇప్పుడు ఇంటర్నేషనల్ క్లబ్ ఇంపాక్ట్ గా మారిందని సంతోషం వ్యక్తం చేసారు ఇంపాక్ట్ స్థాపించి ఇంతమంది వ్యక్తిత్వ వికాస నిపులను తయారు చేస్తున్న గంపా నాగేశ్వర్ రావ్ కి జీవితాంతం రుణపడి ఉంటానని, నాకు ఇంత జ్యానం అందించి, నన్ను ఈ స్థితిలో ఉండడానికి నన్ను ప్రత్సహిస్తున్న నా గురువులు వెంకట్రావు అప్పన్నకి, పిన్నం రవి, బోండ్ల రాజేందర్ ఇజ్జగిరి శ్రీనివాస్ మరియు నా తోటి ట్రైనర్లకు, పార్టిసిపేట్స్ కి కృతజ్ఞత తెలుపుకుంటున్నాని అన్నారు. అనంతరం నూతనంగా వ్యక్తిత్వ వికాసం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న నూతన ట్రైనర్లకు వెంకట్ ఫౌండేషన్ గంపా వెంకట్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది.

# ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం



**హన్మకొండ జిల్లా, జై భీమ్ న్యూస్**

అఖిల భారత విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో సామ జగన్ మోహన్ స్మారక భవన్ లో సామా జగన్ మోహన్ వర్ధంతి సందర్భంగా ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రముఖ మాసాడి బాబురావు పాల్గొని స్వతంత్రం వచ్చినంక జాతీయ జెండా కోసం మొట్టమొదటిసారి అమరుడైన విద్యార్థి పరిషత్ కార్యకర్త సామా జగన్ మోహన్ రెడ్డి జాతీయ భావాలతో ముందుకు పోయే ఏకైక సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ఎంతోమంది విద్యార్థి పరిషత్ కార్యకర్తలు అమరులైనా కూడా క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం అంటూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు ఎంతోమంది ఉన్నారు అదేవిధంగా విద్యార్థులందరూ కూడా ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులు ముగించుకొని మీ భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రమేష్, సుందర్ రెడ్డి, తెలంగాణ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట లవన్ కుమార్, వరంగల్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంట హర్ష వర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరుగు శ్యామ్, నగర అధ్యక్షులు డాక్టర్ సంపత్, కర్ణాకర్, డాక్టర్ ఓంకార్, పూర్వ నగర అధ్యక్షులు కొత్తపల్లి సుధాకర్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ రామాబాబు, వరంగల్ విభాగ్ కన్వీనర్ అయితే నిఖిల్, హనుమకొండ జిల్లా ఆరేపల్లి సుజిత్, పూర్వ కార్యకర్తలు ప్రస్తుత కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# నీ అయ్య లేకపోతే నీ బతుకు ఏంది?

**కరీంనగర్ జిల్లా, అక్షరన్యూస్:**

తెలంగాణలో బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ రాజుకుంటోంది. ఇరు పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ఒక డ్రామా ఆర్టిస్ట్ అని.. ఆయనకు ఒకప్పుడు వేసుకునేందుకు బట్టలు కూడా ఉండేవి కావని ఎద్దేవా చేశారు. తనను గాలి తిరుగుడు అనడంపై బండి సంజయ్ మండిపడ్డారు. 'నీ అయ్య లేకపోతే నీ బతుకు ఏంది?' అని కేటీఆర్‌ను నిలదీశారు. తాను జనం కోసం పోరాడానని.. కేటీఆర్ అమెరికాలో చిప్పలు కడిగాడని విమర్శించారు. ఎన్నికలు వస్తేనే కేంద్ర పాలిత ప్రాంతం గుర్తుకు వస్తుందన్నారు. 'నీ అవినీతిని బయట పెడుతానన్నారు. ఇప్పటికే నీ చెల్లె జైలుకు పోయింది. మేం రాముడి వారసులం. మీరు బాబర్ వారసులు' అంటూ కేటీఆర్‌పై బండి సంజయ్ విరుచుకుపడ్డారు.

# పదోతరగతి పరీక్ష ఫలితాల విడుదల

**హైద్రాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో పదో తరగతి ఫలితాలు రేపు విడుదల కానున్నాయి. పరీక్ష పత్రాల మూల్యాంకనం, కంప్యూటీకరణ కూడా పూర్తవడంతో ఫలితాలను చేసేందుకు తెలంగాణ విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో ఫలితాలను వెల్లడించనున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం కూడా టెన్త్ క్లాస్ ఫలితాల వెల్లడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. మొత్తం 5.08 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,7,952 మంది బాలురు కాగా, 2,50, 433 మంది బాలికలున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,676 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఓ వైపు పరీక్షలు జరుగుతుండగానే.. ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షా పత్రాల మూల్యాకనం 19 కేంద్రాల్లో నిర్వహించారు. అనంతరం కోడింగ్, డీ కోడింగ్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. తెలంగాణ టెన్త్ రిజల్ట్స్‌ను https://results.cgg.gov.in వెబ్‌సైట్‌పై క్లిక్ చేసి తెలుసుకోవచ్చు. విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే.. స్క్రీన్‌పై రిజల్ట్స్ ప్రత్యక్షం అవుతాయి. ఫలితాలతో పాటు మార్కుల మెమో కూడా ఉంటుంది. గతేడాది రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 13వ తేదీతో ముగియగా.. రిజల్ట్స్ మే 10వ తేదీన విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 15 రోజులు ముందే పరీక్షలు పూర్తయ్యాయి. ఇప్పటికే ఏపీ పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడైన విషయం తెలిసిందే. ఏపీ పది పరీక్షల్లో 86.69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 84.32 శాతం, బాలికలు 89.17 శాతం మంది పాస్ అయ్యారు. పార్వతీపురంమన్యం జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత శాతం 96.37 కాగా.. కర్నూలు జిల్లాలో అత్యల్ప ఉత్తీర్ణత శాతం 62.47 నమోదైంది. ఏపీలో మే 24 నుంచి జూన్ 3 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. 2,803 స్కూల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా.. 17 పాఠశాలలో ఒక్కరు కూడా పాస్ కాలేదు.

# ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి




**హన్మకొండ జిల్లా, జై భీమ్ న్యూస్**

ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలి. జిల్లా ఎలక్షన్ అధికారి, కలెక్టర్ ఆదేశముల మేరకు సోమవారం వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రోగ్రాం అధికారులు, డాక్టర్లు, సిబ్బందితో కలసి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి సాంబశివ రావు స్వీప్ అవగాహన ర్యాలీని ప్రారంభించి ప్రధాన రోడ్డుపై మానవ హారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ మే 13 వ తేదీన జరిగే లోక్ సభ ఎన్నికలలో విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తుందన్నారు. ఎన్నికలలో ఎటు వంటి ప్రలోబాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం నుండి ప్రధాన రోడ్డు గుండా ప్ల కార్డులు, నినాదాలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనకు హాజరైన ప్రజలు, డాక్టర్లు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, వారి సిబ్బంది ముఖ్యమైన కూడళ్ళలో, సామూహికంగా ప్రజలు ఉండే ప్రదేశాలకు వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి మదన్మోహన్ రావు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు ఎన్‌సిడి అధికారి డాక్టర్ ఉమా శ్రీ, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గీతా, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ సూపర్ వైసర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అరగంట పవర్ కట్..

-కీసర డీఈపై సస్పెన్షన్ వేటు
-ఏఈఈపై చర్యలకు టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలు

**హైద్రాబాద్, జై భీమ్ న్యూస్**

అరగంట కరెంట్ నిలిపివేత నేపథ్యంలో హైదరాబాద్‌లోని హబ్సిగూడ సర్కిల్ కీసర డివిజనల్ ఇంజినీర్ (డీఈ) ఎల్. భాస్కర్‌రావును దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ శనివారం రాత్రి సస్పెండ్ చేశారు. నాగారం ఆపరేషన్ అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈఈ)పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకోవాలన్నా.. సర్కిల్ ఎస్ఈ ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. 33కేవీ అమ్ముగూడ ఫీడర్‌పై డీఈ భాస్కర్‌రావు శనివారం అనుమతి లేకుండానే ఎల్‌సీ ఇచ్చారు. దీంతో ఆ రోజు ఉదయం 10.05 నుంచి 10.35 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే సమయంలో నాగారంలో మాజీ మంత్రి మల్లారెడ్డి భారాస ఎన్నికల ప్రచార సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కరెంట్ కోతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ విషయం కార్పొరేట్ కార్యాలయం దృష్టికి రావడంతో నివేదిక ఇవ్వాలని ఎస్ఈ, సీజీఎంను సీఎండీ కోరారు. ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా అరగంట పాటు కరెంట్ సరఫరా నిలిపేశారని తేలింది. దీనిని తీవ్రంగా భావించిన యాజమాన్యం డీఈ, నాగారం ఏఈఈపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అలానే ఈ వేసవిలో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై కార్పొరేట్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది

# నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పక్కడ్బందీ చర్యలు చేపట్టాలి



**జిడబ్ల్యూఎంసీ, జై భీమ్ న్యూస్**

గ్రేటర్ వరంగల్ నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పక్కడ్బందీ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా తాగునీటి సరఫరా పర్య వేక్షణ ప్రత్యేకాధికారి డాక్టర్ బి. గోపి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం లో నగరంలో తాగునీటి సరఫరాపై హను మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి జీడబ్ల్యూఎంసీ, పబ్లిక్ హెల్త్, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా త్రినగరిలో ప్రతి రోజు ఎంత ఎంఎల్ డి నీటి సరఫరా చేస్తున్నారు, తాగునీటి సమస్యలు ఏ యే ప్రాంతాల్లో ప్రధానంగా ఉన్నాయి, నగరంలో ఎన్ని వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారనే వివరాలను డాక్టర్ గోపి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లా డుతూ వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగి త్రాగునీటి వనరులు (భూగర్భ జలాలు) తరిగిపోతున్నాయని, ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. జిడబ్ల్యూఎంసీ పరిధి లోని 66 డివిజన్లకు అవసరమైన త్రాగునీ టి వనరులు అందుబాటులో ఉన్నాయని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి త్రాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం రోజు 210 ఎంఎల్ డి నీటి సరఫరా చేస్తున్నారని, దీనికి అదనంగా మరో 40 ఎంఎల్ డి త్రాగు నీటిని సరఫరా చేయాలన్నారు. వేసవి పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవని, అప్రమత్తంగా ఉంటూ త్రాగునీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరా క్రమంలో ఎట్టి పరిస్థితిల్లో లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ఇక వేళా ఏదైనా సమస్య ఉత్పన్నం ఐతే గంటల వ్యవధిలోనే మరమ్మతులు చేసి నీటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగర పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల పైన ప్రత్యేక దృష్టి సారించి అదనంగా నీరు అందించాలన్నారు. తాగునీటి సరఫరా రోజువారి నివేదిక కమిషనర్ కు సమర్పించాలన్నారు. నీటి సరఫరా లో సమస్యల పరిష్కారానికి స్వయం సహాయక బృందం సభ్యులు(ఎస్ హెచ్ జీ)/ రెసిడెంట్ వెల్ఫేర్ సంఘాల సహకారాన్ని తీసుకోవాలన్నారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యాత ఇస్తున్నదని. తాగు నీటి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ప్రతి రోజు పరిష్కరానికి చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ తరవాత వరంగల్ నగరంమే పెద్దదని ఆ స్థాయిలో తాగునీటి సరఫరా జరగాలన్నారు. తాగునీటికి సంబంధించిన ఏ చిన్న సమస్య తలెత్తినా ఆ సమస్యను వెంటనే పరిష్కరించేవిధంగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులను వార్డుల ప్రత్యేక అధికారులుగా నియమించామని, ప్రతిరోజు డివిజన్లకు క్షేత్ర స్థాయిలో పర్యటించి చివరి ఇంటి వరకు తాగునీరు చేరే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఈ రెండు నెలల్లో ప్రణాళిక ప్రకారం నీటి సరఫరా జరగాలన్నారు.గ్రేటర్ కమిషనర్ మాట్లాడుతూధర్మసాగర్ రిజర్వాయర్ నుండి నాలుగు ఫిల్టర్ బెడ్ల ద్వారా వరంగల్ మహానగరంలోని 66 డివిజన్లకు తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. ఏజెన్సీ ద్వారా ఎప్పటికప్పుడు లీకేజీలు, మరమ్మతు పనుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిడబ్ల్యూ ఎంసీ లో ఉన్న 24 వాటర్ ట్యాంకర్లకు తోడుగా వేసవి లో మరో 25 అదనపు వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయంగా నగరంలో తాగునీటి సరఫరాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారంగా తాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జిడబ్ల్యూ ఎంసీ లో నీటి సంబంధ సమస్యల సత్వర పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు పరిష్కరిస్తున్నామని, దీనికితోడుగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసి స్వయంగా అధికారులు సమస్యాత్మక ప్రాంతాల ప్రజలకు ఫోన్ చేసి నీటి సరఫరా స్థితి గతులపై వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకొంటున్నామని అన్నారు. నగరం లో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలలో ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్ లో ఏఈ క్షేత్రస్థాయి అధికారితో ప్రతిరోజు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు లీకేజీల అరికట్టడం, మరమ్మతులు చేయడం జరుగుతున్నదని కమీషనర్ తెలిపారు. అనంతరం ప్రత్యేక అధికారి నగర పరిధిలోని కేయుసి ఫిల్టర్ బెడ్ ను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నీటి సరఫరా నిర్వహణ తీరును ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇట్టి సమీక్షలో బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్ కుమార్, ఈఈలు రాజయ్య, బి ఎల్ శ్రీనివాస్, శ్రీనివాస్రావు, ప్రత్యేక అధికారులు, డీఈలు, ఏఈలు, లైన్ మెన్ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలి

**వరంగల్ జిల్లా, జై భీమ్ న్యూస్**

ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా లోకసభ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్, ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ దిలిబన్, ధీరజ్ సింగాలు అన్నారు. సోమ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో పోటీలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో జరిగిన సమావేశంలో వరంగల్ రిటర్నింగ్ అధికారి పి ప్రావీణ్య తో కలిసి పాల్గొన్నా రు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్య ర్థులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి రోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటలలోపు ప్రచారం చేసుకోవా లన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఫేక్ న్యూస్ లు శాంతి భద్రతలను విఘాతం కలిగించే పోస్టులు పెట్టొద్దు అన్నారు. అలాంటి పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. సి విజిల్ ఆప్‌ను ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలని ఏమైనా ఫిర్యాదులు వచ్చిన గంటలోగా చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ సందర్భంగా ఆర్ఓ ఎన్నికల సంఘం నియమావళిని పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియామావళి, ఎంసీఎంసీ, సి విజిల్, సువిధ తదితర అంశాలపై కూలంకషంగా వివరించి, అభ్యర్థులలో ఎన్నికలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం అభ్యర్థులు విధిగా మూడు రకాల (ఏ,బి,సి) వ్యయ రిజిస్టర్లు నిర్వహించాల్సి ఉంటుందని, అట్టి రిజిస్టర్ లను మే నెల 2,6,10 తేదీలలో రిటర్నింగ్ అధికారి కార్యాలయ ంలో కేంద్ర వ్యయ పరిశీలకులు పరిశీలించి షాడో రిజిస్టర్ కు అభ్యర్థి నిర్వహిస్తున్న రిజిస్టర్ సరిపోల్చడం జరుగుతుందని, అభ్యర్థులు చేసే ఖర్చులను రేట్ చాట్ ప్రకారం లెక్కించడం జరుగుతుందని, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజులలోగా రిటర్నింగ్ అధికారి కు రిజిస్టర్ లు అందజేయాలని, పోలింగ్ నిర్వహణకు ముందు 48 గం. ముందే ప్రచారాన్ని ఆపివేయాలని, ఇట్టి పీరియడ్ లో ప్రచారం నిర్వహించకూడదని, అభ్యర్థులు 3 సార్లు ప్రింట్ మీడియా యందు అంటిసిడెంట్స్ వివరాలు ప్రచురించాలని, అభ్యర్థి ఎన్నికల్లో 95 లక్షలకు మించి ఖర్చుచేయడానికి వీలులేదని, ఖర్చు పెట్టే ప్రతి రూపాయి రిజిస్టర్ లో నమోదు చేయాలనీ, సీ-విజిల్




ఆప్ ద్వారా ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని, వ్యయ రిజిస్టర్ ల సమర్పణకు అభ్యర్థి తరపున ఏజెంట్‌ను నియమించు కుని సమర్పించవచ్చునని, చేసే ఖర్చులు అభ్యర్థికి, పార్టీకీ ఎలా వెళతాయని అంశంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. 12డి క్రింద గుర్తించిన 85 ఏళ్ల పైబడిన వృద్ధ, నిస్సహాయ స్థితిలో గల దివ్యంగులకు హెూం కాంపెయినింగ్ ద్వారా నియోజక వర్గం లో ఇంటి వద్దే ఓటు వేయడానికి గుర్తించబడ్డ వారి వద్దకే వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించడం జరిగిందని, అట్టి సమాచారాన్ని అభ్యర్థులు తెలుసుకోవాలని ఆర్ఓ తెలిపారు. ఈ నెల 25 నుండి పోలింగ్ సమాచార చిటిలను బిఎల్ఓల ద్వారా ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతున్నదని, బూట్ లెవెల్ ఏజెంట్లు కూడా ప్రతి ఓటర్కు పోలింగ్ చిటి అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డెప్యూటీ ఏఆర్ఓ సంధ్యారాణి, రాధిక గుప్తా, ఏఆర్ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే,రోహిత్ సింగ్, కె శ్రీనివాస్,డి ఎస్ వెంకన్న, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, ఉప ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ అసమర్థ పాలన

**మహబూబాబాద్, జై భీమ్ న్యూస్**

బీజేపీ ప్రధాని అభ్యర్థిగా మూడోసారి కూడా మోదీయే ఉంటారని, మరి ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రశ్నించారు. ఇండియా కూటమిలోని ముఖ్యనేతలు సోరెన్, కేజ్రీవాల్‌తో పాటు కవిత, మనీశ్ సిసోడియా జైలులో ఉన్నారని.. అలాంటి పార్టీల కూటమి అధికారంలోకి వస్తే పాలన ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని అన్నారు. మోదీ పాలనలో భారత్ ఖ్యాతి పెరిగిందని, దేశానికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. సోమవారం మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన జన సభలతో పాటు హైదరాబాద్‌లోని నిజాంపేట్‌లో జరిగిన రోడ్ షోలో నడ్డా మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో కుంభకోణాలే వెలుగులోకి వచ్చాయని, కాంగ్రెస్ అంటేనే కుటుంబ పాలన అని నడ్డా విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ అసమర్థ పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలిందని అన్నారు. తాము ముస్లిం రిజర్వేషన్లను ఎత్తివేసి.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఇతర వర్గాలకు ఆ రిజర్వేషన్లను బదలాయిస్తామని తెలిపారు. తాము అన్ని రిజర్వేషన్లను రద్దుచేస్తామని కాంగ్రెస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలని చెప్పారు. మానుకోటలో రైల్వేస్టేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దామని, హైదరాబాద్ తరహాలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని నడ్డా పేర్కొన్నారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తేవడంతో పాటు జాతీయ గిరిజన వర్సిటీని ములుగులో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మానుకోటలో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే మహబూబాబాద్ మునిసిపాలిటీని అమృత్ పథకంలో చేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఏకలవ్య రెసిడెన్షియల్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తామని నడ్డా హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని పార్టీ నాయకులకు నడ్డా పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి నడ్డా.. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ నాయకులతో హరిత ప్లాజాలో సమీక్ష నిర్వహించారు. మోదీ ప్రభు త్వం సాధించిన విజయాలను ఇంటింటికీ తీసుకువెళ్లి కమల వికాసమే లక్ష్యంగా పనిచేయాలని నడ్డా పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీలు కేరళలో కాంగ్రెసతో కుస్తీ పడుతూ తెలంగాణలో స్నేహం చేస్తూ తమ సిద్ధాంతాలను గాలికి వదిలేశారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కులాలు, మతాలుగా ప్రజలను విభజించి రాజకీయ లబ్ధిపొందాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ చూస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తీరు ఏరుదాటాక తెప్పతగలేసినట్లు ఉందన్నారు. కొందరు కాంగ్రెస్ నేతలు వారి కుటుంబసభ్యులకే ఎంపీ టికెట్లు ఇప్పించుకున్నారని విమర్శించారు.

## ఎన్నికల సంఘం నిబంధనల
# మేరకే గుర్తుల కేటాయింపు

**వరంగల్ జిల్లా, జై భీమ్ న్యూస్**

ఎన్నికల సంఘం నిబంధనల మేరకే గుర్తుల కేటాయించినట్లు 15 వరంగల్ ఎస్సి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి ప్రావీణ్య తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నామినేషన్ ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం కలెక్టరేట్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ సమక్షంలో రిటర్నింగ్ అధికారి అభ్యర్థులకు సింబల్స్ (గుర్తుల) కేటాయింపు జరిపారు. అనంతరం ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి సూచనలు చేస్తూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీలకు ప్రత్యేకంగా ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించిందని, ఎన్నికల సంఘంచే గుర్తింపు పొందని, రిజిస్టర్ అవ్వని, ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు తెలుగు అక్షర మాల ప్రామాణికంగా అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరిగిందని, ఒకే గుర్తును ప్రతిపాదించిన ఇద్దరు అభ్యర్థులకు డ్రా పద్ధతిలో సింబల్ కేటాయింపు చేశామని, ఎన్నికల సంఘం సూచించిన గుర్తులలో నుండి ఇండిపెండెంట్ అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఆర్ఓ సంధ్యారాణి, సహాయ ఆర్ఓ కే శ్రీనివాస్, ఏఆర్ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, రాధిక గుప్తా, పీయూష్ కుమార్, డిఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, కే వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల పోలీస్ నోడల్ అధికారులు, వివిధ పార్టీల నుండి పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శంభునిపేటలో క్రికెట్ బెట్టింగ్

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న అయిదుగురు యువకులను వరంగల్ మిల్స్ కాలనిపోలీసులు అరెస్టు చేశారు. శంభునిపేట గిరిప్రసాద్ నగర్‌లోని నవాజ్ ఇంటి పక్కన ఆదివారం జరిగిన 20- 20 క్రికెట్ మ్యాచ్పి బెట్టింగ్ నిర్వహి స్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడిచేశారు. నవాజ్, ఆసీఫ్, ఫరూక్, నూరుద్దీన్, రంజాన్ ల వద్ద రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

## పొద్దుతిరుగుడు పంట..
# రైతుల కళ్ళల్లో మంట




**- రైతుల ఇబ్బంది మాకెందుకు అన్నట్టు మండల నాయకుల తీరు**
**-వడ్లకు అయితే కమీషన్ వస్తది. పొద్దుతిరుగుడు అయితే రాదా?**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జై భీమ్ న్యూస్**

ఇల్లంతకుంట మండలంలో దాదాపుగా 700 ఎకరాలకు పైగా పొద్దుతిరుగుడు పంట సాగు అయింది. ఈ పంట ఒక ఎకరానికి అందాజుగా 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఇల్లంతకుంట మండలంలో కొనుగోలు కేంద్రం లేక పక్కా జిల్లాలోని బెజ్జంకి మండలం ఉన్న కొనుగోలు కేంద్రానికి తీసుకుపోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. పంటను కోయడానికి ఇబ్బంది పడని రైతు అమ్మడానికి నానా తిప్పలు పడుతున్నాడు. కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లిన ఎప్పుడు కాంట పెడుతారో తెలీదు, కనీసం కుప్ప పోయడానికే జాగా లేని పరిస్థితి. మండల నాయకులు పేరుకే తప్పా పనిచేయడానికి పనికిరారు. రైతుల గోసలు మాకెందుకు అన్నట్టుగా వాళ్ళు వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ అధికారులను అడిగితే పై అధికారులు ఎలా చెప్తే అలానే అంటూ... మేమేం చేయగలమని చేతులెత్తేశారు. మార్క్ ఫెడ్ అధికారులను సంప్రదిస్తే అక్కడ గోదాం లేవు, చూసుకోవడానికి ఎవరూ ముందుకు రావట్లేదు అని తెలిపారు. రైతులు పంట పండించడం ఒక ఎత్తయితే... దాన్ని అమ్మడం మరొక ఎత్తయితుంది.

# కాంగ్రెస్‌లోకి గుత్తా అమిత్‌రెడ్డి చేరిక



**నల్లగొండ, జై భీమ్ న్యూస్**

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ నేత గుత్తా అమిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఆయన తన బాబాయి, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డితోపాటు మరికొందరితో కలసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతకుముందు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి జూబ్లీహిల్స్‌లోని అమిత్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. కాంగ్రెస్‌లో చేరితే సముచిత స్థానం కల్పిస్తామని అమిత్‌రెడ్డికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వాస్తవానికి అమిత్‌రెడ్డి ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ ఆశించారు. అదే సమయంలో కాంగ్రెస్ టికెట్ కోసం మంత్రి కోమటిరెడ్డితోపాటు వేం నరేందర్‌రెడ్డిని కలువడం చర్చనీయాంశంగా మారింది. చివరకు కాంగ్రెస్ టికెట్ రాకపోయినా ఆయన ఆ పార్టీలో చేరడం గమనార్హం.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# గాజాలోకి మరింత సాయానికి ఇజ్రాయెల్ అనుమతి

**జై భీమ్ న్యూస్ డెస్క్:**
ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలమైన గాజాలోకి మరింత సహాయ సామగ్రిని చేర్చే దిశగా అమెరికా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు అధ్యక్షుడు బైడెన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆదివారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు.ఆహార పదార్థాలు, నిత్యావసరాలు సహా ఇతర సహాయ సామగ్రిని అనుమతించేందుకు మరిన్ని దారులను తెరుస్తామని నెతన్యాహు హామీ ఇచ్చారు. ఈవారంలోనే ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హమాస్ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ చేపట్టిన యుద్ధంతో గాజాలో తీవ్ర క్షామం నెలకొంది. సామాన్య ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ నేపథ్యంలో అక్కడికి మానవతా సాయాన్ని అనుమతించాలని ప్రపంచ దేశాలు ఒత్తిడి పెంచాయి. దీంతో ఉత్తర సరిహద్దుల్లో మరికొన్ని దారులు తెరవడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. రఫాలోనూ భూతల దాడులు ప్రారంభిస్తే గాజాలోని మిగిలిన ప్రాంతంతో దానికి సంబంధాలు తెగిపోనున్నాయి. అప్పుడు ఈ దారులే కీలకం కానున్నాయి. రఫాలోని దాదాపు పది లక్షల మంది పాలస్తీనావాసులకు రక్షణ కల్పించని ఏ ఆపరేషన్‌కూ అమెరికా మద్దతు ఉండబోదని బైడెన్ ఈ సందర్భంగా తేల్చి చెప్పినట్లు శ్వేతసౌధం ప్రకటించింది. రఫా ఆక్రమణను అగ్రరాజ్యం తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు గతంతో పోలిస్తే గాజాలోకి మానవతా సాయం ముమ్మరంగా చేరుతోందని బైడెన్ తెలిపారు. ఇది ఇలాగే కొనసాగేందుకు సహకరించాలని నెతన్యాహుకు సూచించారు. హమాస్ చెరలో ఉన్న బందీలను వెంటనే విడిచిపెట్టాలని బైడెన్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తద్వారా కాల్పుల విరమణ, గాజా పునఃనిర్మాణం దిశగా ముందడుగు వేయాలని హమాస్‌కు సూచించారు. మరోవైపు ఇజ్రాయెల్ భద్రత విషయంలో అమెరికా ఏమాత్రం వెనకడుగు వేయబోదని బైడెన్ హామీ ఇచ్చారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల సమయంలో అందించిన ఆపన్నహస్తమే అందుకు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు.

# గుజరాత్‌లో రూ.600 కోట్ల డ్రగ్స్ పట్టివేత

**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**
దేశంలో మరో అతిపెద్ద డ్రగ్స్ రాకెట్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా పట్టుకున్నాయి. ఏటీఎస్, ఐసీజీ నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.600 కోట్ల విలువైన 86 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. 14 మంది పాకిస్థానీలను అరెస్టు చేశాయి. తమిళనాడులోని కొందరు గుర్తుతెలియని వ్యక్తులకు ఈ సరుకును అప్పగించి, అక్కడి నుంచి శ్రీలంకకు తరలించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించినట్టు ఏటీఎస్ అధికారులు తెలిపారు. తదుపరి విచారణ కోసం కేసును నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)కి అప్పగించినట్టు డీజీపీ వికాస్ సహారు మీడియాకు తెలిపారు. తమిళనాడుకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులకు పాకిస్తాన్ ఫిషింగ్ బోట్ మాదక ద్రవ్యాలను అందజేస్తుందని ఏటీఎస్ నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో, ఏటీఎస్, ఐసీజీ, ఎన్‌సీబీ సంయుక్తంగా శుక్రవారం ఫోర్‌బందర్‌కు 180 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానిత పడవను అడ్డగించాయి. ఆ పడవలోని వారు హెరాయిన్ ప్యాకెట్లను సముద్రంలోకి విసిరేయడం ప్రారంభించారు. అనంతరం కాల్పులు జరపడంతో, ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పడవ కెప్టెన్ నజీర్ హుస్సేన్ కుడిచేతికి బుల్లెట్ గాయమైంది. బలూచిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్ మాఫియా హాజీ అస్లాం అలియాస్ బాబు బలోచ్ ఈ




డ్రగ్స్‌ను పంపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఏటీఎస్ తెలిపింది. గత మూడేండ్లలో వివిధ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన 11వ ఆపరేషన్‌గా పేర్కొంది. ఇటీవల గుజరాత్, రాజస్థాన్‌లో రహస్యంగా డ్రగ్ ల్యాబ్‌లు నడుపుతున్నట్టు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో గుర్తించి, దాడులు నిర్వహించింది. ఈ ప్రాంతంలోని మూడు తయారీ కేంద్రాల నుంచి సుమారు రూ.300 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే గుజరాత్ తీరంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడటం గమనార్హం. అయితే ఎన్నికలపుడు ఇంత భారీ స్థాయిలో సరఫరా వెనుక అధికారపార్టీ పెద్దల హస్తం ఉన్నట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

### హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో
# పాలస్తీనా జెండా కలకలం



**జై భీమ్ న్యూస్ డెస్క్:**
గాజాపై దాడులకు వ్యతిరేకంగా కొద్దిరోజులుగా అమెరికా వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. అవి మరింత తీవ్రరూపం దాల్చుతున్నట్లు కనిపిస్తున్నాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన వీడియోలో ప్రముఖ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పాలస్తీనా జెండా కలకలం సృష్టించింది. పాలస్తీనియన్లపై దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌తో ఆర్థిక సంబంధాలను అమెరికా తెంచుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే హార్వర్డ్‌లోని ప్రఖ్యాత జాన్ హార్వర్డ్ విగ్రహంపై పాలస్తీనా జెండాను ఎగరవేశారు. వాస్తవంగా దానిపై అమెరికా జెండా ఉంటుంది. లేకపోతే ఎవరైనా విదేశీ ప్రతినిధుల వచ్చినప్పుడు వారి దేశ జెండాలను ఉంచుతారు. కానీ నిరసనకారులు అమెరికా జెండాను పక్కనపెట్టి.. పాలస్తీనాకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ దేశ జెండాను ఎగరవేశారు. హార్వర్డ్ ప్రతినిధి జొనాథన్ ఎల్ స్వెయిన్ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఇది విశ్వవిద్యాలయ నిబంధనలకు విరుద్ధమని వెల్లడించారు. ఈ ఘటన కారకులపై క్షమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.తొలుత న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో మొదలైన ఈ ఆందోళనలు అగ్రరాజ్యమంతా విస్తరించాయి. దాంతో వందలమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతియుత నిరసనల హక్కును తాము గౌరవిస్తామని జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ వెల్లడించారు. అయితే విద్వేషపూరిత ప్రసంగాలను మాత్రం తీవ్రంగా ఖండిస్తామన్నారు. ఇదిలా ఉంటే.. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో చోటుచేసుకున్న నిరసనల్లో భారత సంతతికి చెందిన విద్యార్థిని అరెస్టయిన సంగతి తెలిసిందే.

### నేతలకు జైలు నుంచి వీసీ ద్వారా ఎన్నికల
# ప్రచారానికి అనుమతించాలి

**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**
ఢిల్లీ హైకోర్టులో తమాషా అయిన ప్రజాహిత వ్యాజ్యం (పిల్) పడింది. అరెస్టయి జైళ్లలో ఉన్న రాజకీయ నాయకులను 2024- సార్వత్రిక ఎన్నికల్లో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా ప్రచారం నిర్వహించేందుకు అనుమతించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ కోర్టులో పిల్ దాఖలైంది. న్యాయవాది ఇమ్రాన్ అహ్మద్ ద్వారా న్యాయ విద్యనభ్యసిస్తున్న చివరి సంవత్సరం లా విద్యార్థి అమర్జీత్ గుప్తా ఈ వ్యాజ్యం వేశారు. జైలు నుంచి వీసీ ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, వ్యవస్థను నెలకొల్పేలా ఇసిని ఆదేశించాలని పిల్‌లో కోరారు. ఇదిలా ఉండగా రాజకీయ కక్షల కారణంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జైలులో ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నించినా వారికి బెయిల్ రాలేదు. ఈ నేపథ్యంలోనే పిల్ దాఖలైనట్టు తెలుస్తోంది. కాగా రాజకీయాల్లో ఉంటూ నిజంగా తీవ్ర నేరాలు చేసి జైలుకెళ్లిన వారికి సైతం వీసీ. ద్వారా ప్రచారం నిర్వహించే వెసులుబాటు కల్పిస్తే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, చట్టాల ఉల్లంఘన అవుతుందన్న అభ్యంతరం వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు.

# టిబెట్‌పై చైనా అణచివేతను ప్రపంచానికి చాటుతా


**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**
టిబెట్ గుర్తింపును దెబ్బతీసేందుకు చైనా ప్రయత్నిస్తోందని, టిబెట్ వాసులు నానాటికీ పెరుగుతున్న భయం, అణచివేతల నడుమ బతుకుతున్నట్లు నామ్‌కీ (24) తెలిపారు. 2015 అక్టోబరు 21న ఈ యువతి తన సోదరి టెన్జిన్ డోల్మాతో కలిసి టిబెట్‌లో ఓ ప్రదర్శన నిర్వహించగా, చైనా పోలీసులు ఇద్దరినీ నిర్బంధంలోకి తీసుకొని మూడేళ్లపాటు జైలులో ఉంచారు. టిబెట్ ఆధ్యాత్మిక నాయకుడైన దలైలామా చిత్రాలను బహిరంగంగా ప్రదర్శించి, టిబెట్‌కు స్వేచ్ఛను కోరుకోవడమే నామ్‌కీ సోదరీమణులు చేసిన నేరం. చైనా జైలు నుంచి విడుదలయ్యాక గతేడాది జూన్‌లో నామ్‌కీ భారత్‌కు చేరుకున్నారు. పది రోజుల కాలినడకతో నేపాల్‌కు వచ్చిన ఈమె అక్కడి నుంచి హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలకు వచ్చారు. టిబెట్‌పై చైనా అణచివేతను ప్రపంచానికి చాటుతానంటున్న నామ్‌కీ ధర్మశాలలో ప్రవాస టిబెటన్ ప్రభుత్వం నడుపుతున్న 'షేరబ్ గాట్సెల్ లింగ్' విద్యాసంస్థలో చదువుకొంటున్నారు. మీడియా ప్రతినిధులతో నామ్‌కీ మాట్లాడుతూ.."టిబెట్ గురించి చైనా ప్రభుత్వం ప్రపంచానికి చూపుతున్నది వాస్తవ పరిస్థితికి పూర్తిగా విరుద్ధం. మతస్వేచ్ఛను నిరాకరిస్తున్న చైనా టిబెట్ సాంస్కృతిక వారసత్వాన్ని దెబ్బతీయాని చూస్తోంది. ఈ విషయాలు ప్రపంచానికి తెలిసేలా టిబెట్ గొంతుకనవుతా" అన్నారు.

# జైల్లో కేజ్రీవాల్‌ను చూసేందుకు భార్యకు అనుమతి నిరాకరణ..!



**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**
మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహాడ్ జైల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.సోమవారం ఆయనను కలిసి మాట్లాడేందుకు సీఎం సతీమణి సునీత అనుమతి కోరారు. అయితే ఇందుకు అధికారులు అంగీకరించలేదని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ఆప్ నేత ఆతిశీకి అనుమతినిచ్చిన నేపథ్యంలో సునీత అభ్యర్థనను తిరస్కరించామని జైలు అధికారులు చెప్పారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. దిల్లీ మంత్రి ఆతిశీ సోమవారం సీఎంతో మాట్లాడనున్నారు. ఇక, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మంగళవారం తిహాడ్ జైలుకు వెళ్లి కేజ్రీవాల్‌ను కలవనున్నారు. దీంతో మంగళవారం తర్వాతే సునీతను అనుమతించనున్నట్లు జైలు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. అయితే, నిబంధనల ప్రకారం వారంలో రెండుసార్లు మాత్రమే ములాఖత్‌కు అనుమతి ఉంది. దీంతో భర్తను చూసేందుకు సునీతకు వచ్చేవారమే అనుమతి లభించనుంది. అయితే, జైల్లో ఉన్న వ్యక్తితో ఒకేసారి ఇద్దరు వ్యక్తులు మాట్లాడే వీలుందని, అయినప్పటికీ తిహాడ్ అధికారులు సునీతను అనుమతించడం లేదని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇటీవల భగవంత్ మాన్.. కేజ్రీవాల్‌ను కలిసినప్పుడు పంజాబ్ సీఎం వెంట ఆప్ జనరల్ సెక్రటరీ సందీప్ పాథక్ ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఉద్దేశపూర్వకంగానే సునీతను జైలు అధికారులు అనుమతించడం లేదని దుయ్యబట్టారు. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 1 నుంచి ఆయన తిహాడ్ జైల్లో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ పరిణామాలు ఆమ్ ఆద్మీ పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ క్రమంలోనే భర్త అరెస్టు నేపథ్యంలో సునీత ప్రచారంలోకి దిగారు. దిల్లీలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు.

# చైనాతో చర్చలు.. భారత్ ఎప్పుడూ తలవంచదు



**న్యూఢిల్లీ, జై భీమ్ న్యూస్ :**
ఇరు దేశాల మధ్య నెలకొన్న సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు చైనాతో జరుపుతున్న చర్చలు సజావుగా, సానుకూల వాతావరణంలో సాగుతున్నాయని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రాజ్‌నాథ్.. భారత్ ఎప్పుడూ తలవంచదన్నారు.చైనాతో ఉన్న విభేదాలను ఎత్తిచూపుతూ మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై రాజ్‌నాథ్ ఈ సందర్భంగా స్పందించారు. "భారత్ ప్రస్తుతం బలహీనమైన దేశం కాదు. సైనిక పరంగా ఎంతో శక్తిమంతంగా మారింది. మన పొరుగు దేశాలతో సత్సంబంధాలను కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలనుకుంటోంది. ఈ చర్చల ఫలితాలు ఎలా ఉండబోతాయే తెలుసుకునేందుకు కాస్త వేచి చూడాలి. అలా అని భారత్ ఎవరి ఎదుట తలవంచదు. ఇలా ఎప్పటికీ జరగదని భరోసా ఇస్తాం" అని వ్యాఖ్యానించారు. దేశీయంగా తయారైన రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతుల విలువ 2014లో రూ.600 కోట్లు ఉండగా.. దాని విలువ 2023-24లో రూ.21 వేల కోట్ల మార్క్‌ను దాటిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇవి మరింత పెరిగే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో దేశ ప్రజలను భాగస్వాములను చేయాలనే నిర్ణయానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# అతడి హత్యకు పుతిన్ ఆదేశించి ఉండకపోవచ్చు



**జై భీమ్ న్యూస్ డెస్క్:**
రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ మరణం వెనుక పుతిన్ ఆదేశాలు జారీ చేయలేదని అమెరికా నిఘా వర్గాలు ఓ అభిప్రాయానికి వచ్చాయి.చాలా కాలంగా జైల్లో ఉన్న నావల్నీ ఈ ఏడాది ఫిబ్రవరిలో మరణించారు. అంతిమంగా అతడి మృత్యువుకు మాత్రం పుతిన్ కారణమయ్యారని చెబుతున్నారు. పుతిన్ రష్యా అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికవ్వడానికి సరిగ్గా ముందు ఈ ఘటన చోటు చేసుకొంది. మరోవైపు నాడు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా స్పందిస్తూ.. నావల్నీ మరణానికి పుతిన్ బాధ్యుడని పేర్కొన్నారు. అతడి క్రూరత్వానికి ఈ మరణం ఓ ఉదాహరణ అని అభివర్ణించారు. ఎవరినీ రష్యన్లు ఫూల్స్ చేయలేరని వ్యాఖ్యానించారు. కానీ, కచ్చితమైన కారణాలు చెప్పలేకపోయారు. ఇక రష్యా అధికారులు మాత్రం నావల్నీ మరణం పూర్తిగా సహజమైన కారణాలతోనే చోటు చేసుకొందని చెబుతున్నారు. అతడిపై విషప్రయోగం, హత్యకు ఎటువంటి అవకాశం లేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ విధానాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్న నాయకుడు అలెక్సీ నావల్నీ. 'రష్యా ఆఫ్ ది ఫ్యూచర్' పార్టీ నేతగా అక్కడి ప్రభుత్వ ఉన్నతాధికారుల అవినీతిని బయటపెట్టారు. గత అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌పై పోటీ చేయడంతో దేశవ్యాప్తంగా ఆదరణ లభించింది. ఈ క్రమంలోనే 2020లో సెర్బియా పర్యటనలో ఉన్నప్పుడు అతడిపై విషప్రయోగం జరగడం సంచలనం సృష్టించింది. జర్మనీలో కొన్ని నెలల పాటు చికిత్స తీసుకుని ప్రాణాలతో బయటపడి.. 2021 జనవరిలో రష్యాకు తిరిగొచ్చారు. అయితే, వచ్చీ రాగానే రష్యా పోలీసులు ఎయిర్‌పోర్టులోనే అరెస్టు చేశారు. నిధుల దుర్వినియోగం సహా పలు అభియోగాలపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు అప్పట్లో రష్యా అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపర్చగా వివిధ కేసుల్లో 19 ఏళ్ల జైలు శిక్ష విధించారు.

## క్వార్టర్స్‌లో పురుషుల, మహిళల టీమ్స్

**జై భీమ్ న్యూస్, స్పోర్ట్స్ :**



యువ షట్లర్లతో కూడిన భారత మహిళల , పురుషుల జట్లు థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నాయి సింగపూర్‌తో జరిగిన పోరులో మన అమ్మాయిలు 4-1తో విజయం సాధించారు.ఆసియా చాంపియన్ అయిన భారత్..తొలి పోరులో 4-1తో కెనడాను చిత్తు చేసిన విషయం విదితమే. సింగపూర్‌తో మొదటి సింగిల్స్‌లో అష్మితా చలిహా ఓడినా..దానిని నుంచి కోలుకున్న భారత్ అద్భుత ప్రదర్శన చేసింది.ఇక.. గ్రూప్ 'ఎ'లో చైనా 3-0తో కెనడాపై నెగ్గిన నేపథ్యంలో..భారత్‌తోపాటు ఆతిథ్య మహిళల జట్టుకూడా రౌండ్-8కు క్వాలిఫై అయింది. రెండు వరుస విజయాలతో ప్రస్తుతం చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలిచింది. సింగపూర్‌తో మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో 53వ ర్యాంకర్ చలిహా 15-21, 18-21తో వరల్డ్ నెం. 18 యో జియా మిన్ చేతిలో ఓడింది. అయితే డబుల్స్‌లో..జాతీయ చాంపియన్లు ప్రియ/శ్రుతి 21-15, 21-16తో హెంగ్/జిన్‌పై గెలవడంతో స్కోరు 1-1తో సమమైంది. అనంతరం రెండో సింగిల్స్‌లో ఇషా రాణి 21-13, 21-16తో ఇన్సిరా ఖాన్‌పై నెగ్గి భారత్ ఆధిక్యాన్ని 2-1కి పెంచింది. ఆపై సిమ్రన్/రితిక 21-8, 21-11తో టింగ్/జాన్‌ని చిత్తు చేయడంతో మనోళ్లు 3-1తో తిరుగులేని స్థితిలో నిలిచారు. మూడో సింగిల్స్‌లో అన్మోల్ 21-15, 21-13తో లీని ఓడించడంతో భారత్ ఆధిక్యం మరింత పెరిగింది. ఇక థామస్ కప్‌లో..డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల జట్టు ఇంగ్లండ్‌ను 5 -0తో చిత్తు చేసి క్వార్టర్స్ లో అడుగుపెట్టింది..

## తిరిగి పుంజుకుంటాం..



**జై భీమ్ న్యూస్, స్పోర్ట్స్ :**

200 పరుగులు చేయడం చాలా సులువు, 250o పరుగులు చేయడం కూడా కష్టతరం కాదని నిరూపించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒక్కసారిగా డీలాపడింది. చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 213 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఎస్‌ఆర్‌హెచ్ 134 పరుగులకే ఆలౌటైంది.హోరాహోరీగా ఛేదన సాగుతుందనకుంటే కనీస పోరాట పటిమ కూడా చూపించలేకపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్కే నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 212 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో సన్‌రైజర్స్ 18.5 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలి 78 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది.కాగా, మ్యాచ్ అనంతరం ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఓటమికి గల కారణాలు వివరించాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడంపై స్పందిస్తూ.. మొదట ఫీల్డింగ్ ఎంచుకోవడం ఓటమికి కారణం కాదని పేర్కొన్నాడు. ఛేజింగ్ చేస్తామని భావించే ఆ నిర్ణయం తీసుకున్నామని, కానీ దురదృష్టవశాత్తు పరాజయాన్ని చవిచూశామని కమిన్స్ అన్నాడు. విజయం సాధించడానికి ఛేదన ఉత్తమ మార్గంగా భావించాం. కానీ దురదృష్టవశాత్తు మంచి ఫలితం రాలేదు. వాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. వికెట్ సహకరించింది. మాకు అదే పరిస్థితి ఉంటుదని అనుకున్నాం. ఇక మా బ్యాటింగ్ లైనప్ గురించి సంతోషంగానే ఉన్నాం. ఇవాళ మాత్రమే మేం గెలవలేకపోయాం. ఈ సీజన్‌లో ఇలాంటి ఎన్నో మ్యాచ్‌లను మా బ్యాటింగ్ లైనప్‌లోని ఆటగాళ్లే గెలిపించారు. సీఎస్కే ఇన్నింగ్స్‌లో కూడా మంచు ప్రభావం చూపించింది. ఇది కేవలం రెండు వరుస పరాజయాలు. తిరిగి త్వరగా పుంజుకుంటాం" అని కమిన్స్ అన్నాడు.

# ఈ తప్పులే హైదరాబాద్ ముంచుతున్నాయి..

**జై భీమ్ న్యూస్, స్పోర్ట్స్ :**



ఇటీవల ఢిల్లీ జట్టుపై జరిగిన మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు ఏకంగా 266 రన్స్ చేసింది.. ఓపెనర్లు హెడ్ 89, అభిషేక్ శర్మ 48 రన్స్ చేసి అదరగొట్టారు. ఆ మ్యాచ్లో ఘనవిజయం సాధించిన తర్వాత.. బెంగళూరుతో హైదరాబాద్ జట్టు తలపడింది. ఈ మ్యాచ్లో బెంగళూరు ముందుగా బ్యాటింగ్ చేసింది. 206 పరుగులు చేసింది. అనంతరం చేజింగ్ కు దిగిన హైదరాబాద్ జట్టు 177 రన్స్ మాత్రమే చేయగలిగింది. అయితే ఈ ఓటమిని చాలామంది దురదృష్టం కింద లెక్కేశారు..కానీ, చెన్నై జట్టుతో ఆడిన మ్యాచ్లో అయితే దారుణంగా 134 మాత్రమే చేసి హైదరాబాద్ పరువు పోగొట్టుకుంది. ఆదివారం రాత్రి చెన్నై జట్టుతో జరిగిన మ్యాచ్లో.. టాస్ గెలిచినప్పటికీ హైదరాబాద్ ఫీల్డింగ్ ఎంచుకుంది. మైదానాన్ని అంచనా వేయలేక హైదరాబాద్ కెప్టెన్ బౌలింగ్ వైపు మొగ్గు చూపాడు.. 19 పరుగులకు తొలి వికెట్ కోల్పోయిన చెన్నై.. రెండో వికెట్ కు ఏకంగా 107 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు హైదరాబాద్ బౌలింగ్ ఏ స్థాయిలో ఉందో.. 126 రన్స్ వద్ద చెన్నై రెండో వికెట్ తీసిన హైదరాబాద్.. చెన్నై జట్టు స్కోరు 200 కు చేరుకున్న తర్వాత మూడో వికెట్ పడగొట్టింది. భువనేశ్వర్ కుమార్, కమిన్స్, జయదేవ్ వంటి వారు ఉన్నచోట.. హైదరాబాద్ కేవలం మూడంటే మూడే మాత్రమే వికెట్లు పడగొట్టింది.. 212 పరుగుల లక్ష్యంతో చేజింగ్ కు దిగిన హైదరాబాద్ కేవలం 134 రన్స్ కు ఆల్ అవుట్ అయింది. హెడ్ తేలిపోయాడు. అభిషేక్ శర్మ నిలబడలేకపోయాడు. మార్క్రం సత్తా చూపించలేకపోయాడు. క్లాసెన్ ఇలా వచ్చి అలా వెళ్ళిపోయాడు. ఇక మిగతా వారి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. తెలుగు కుర్రాడు నితీష్ రెడ్డి కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. వాస్తవానికి హైదరాబాద్ ఈ సీజన్లో ముంబై, బెంగళూరు మీద అత్యధిక పరుగులు చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే మరో జట్టు కొట్టేందుకు కూడా

సాహసించని పరుగులు నమోదు చేసింది. అలాంటి జట్టు వరుస రెండు మ్యాచ్లలో దారుణమైన ఆట తీరు ప్రదర్శించింది. దీనిని బట్టి హైదరాబాద్ ముందుగా బ్యాటింగ్ చేస్తేనే గెలుస్తుంది, భారీ స్కోరు సాధిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బెంగళూరు, చెన్నై జట్టుతో జరిగిన మ్యాచ్లలో ఓపెనర్ హెడ్ విఫలమయ్యాడు. అభిషేక్ శర్మ అంతంతమాత్రంగా ఆడాడు.. క్లాసెన్ ఏదో అర్జెంట్ పని ఉందన్నట్టుగా ఇలా వచ్చి అలా వెళ్ళిపోయాడు..

మార్క్రం ఏదో అలా ఆడిపోయాడు.. ఇక మిగతా బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపించలేదు. దీంతో హైదరాబాద్ ఆటగాళ్ల తీరు పట్ల అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఫోర్ల మోత, సిక్సర్ల వర్షం కురిపించిన ఆటగాళ్లు.. నిర్లక్ష్యపు షాట్లు కొట్టి అవుట్ అవుతుండడం పట్ల నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే జట్టు ప్లే ఆఫ్ వెళ్తుందా? అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్సీబీ ఘన విజయం

**జై భీమ్ న్యూస్, స్పోర్ట్స్ :**

గుజరాత్ టైటాన్స్‌ను వాళ్ల సొంతగడ్డపైనే 9 వికెట్లతో చిత్తు చేసింది ఆర్సీబీ.. ఆకాశమే హద్దుగా ఆడిన ఆల్‌రౌండర్ విల్ జాక్స్(100 నాటౌట్) సెంచరీతో బెంగళూరును గెలిపించాడు. దాంతో, ఆర్సీబీ ఖాతాలో మూడో విక్టరీ చేరింది. రన్ మెషీన్ విరాట్ కోహ్లీ(70 నాటౌట్) సైతం హాఫ్ సెంచరీతో కదం తొక్కగా 200 పరుగుల లక్ష్యాన్ని15.5 ఓవర్లకే ఛేదించింది. భారీ ఛేదనలో ఓపెనింగ్ జోడీ మళ్లీ విఫలమైంది. పవర్ ప్లేలోనే ఆర్సీబీ తొలి వికెట్ పడింది. ఓపెనర్ ఫాఫ్ డూప్లెసిస్(24) భారీ షాట్ ఆడి ఔటయ్యాడు. సాయి కిశోర్ ఓవర్లో బౌండరీ వద్ద విజయ్ శంకర్ చేతికి చిక్కాడు. దాంతో, 40 పరుగుల వద్ద ఆర్సీబీ తొలి వికెట్ కోల్పోయింది.

ఫామ్‌లో ఉన్న విల్ జాక్స్ క్రీజులోకి వచ్చాడు. కోహ్లీ జతగా జాక్స్ ఓ రేంజ్‌లో ఆడాడు. రషీద్ ఖాన్ వేసిన 16వ ఓవర్లో జాక్స్ మరింత రెచ్చిపో యాడు. వరుసగా 6, 6, 4, 6, 6 బాదేసి శతకం పూర్తి చేసుకున్నాడు. దాంతో, ఆర్సీబీ 9 వికెట్లతో గెలుపొందింది. అంత కుముందు సొంత గడ్డపై యువకెరటం సాయి సుదర్శన్(84 నాటౌట్), చిచ్చర పిడుగు షారుఖ్ ఖాన్(58)లు హాఫ్ సెంచరీ లతో కదం తొక్కారు. 45 పరుగులకే రెండు వికెట్లు పడినా.. వీళ్లిద్దరూ బౌండరీలతో చెలరేగారు. చివర్లో డేవిడ్ మిల్లర్(26 నాటౌట్) సైతం బ్యాట్ ఝులిపించడంతో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 200 రన్స్ కొట్టింది. అయితే ఈ లక్ష్యాన్ని 16 ఓవర్ల లోపే ఆర్సీబీ పూర్తి చేసింది.



# థామస్, ఉబెర్ కప్‌లో భారత్ శుభారంభం



**జై భీమ్ న్యూస్, స్పోర్ట్స్ :**

ప్రతిష్ఠాత్మక థామస్, ఉబెర్ కప్‌లలో భారతజట్లు శుభారంభం చేశాయి. థామస్ కప్‌లో భారత పురుషుల జట్టు గ్రూప్-సిలో థాయ్ లాండ్‌పై, ఉబెర్ కప్‌లో మహిళల జట్టు కెనడాపై సునాయాసంగా విజయం సాధించింది. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్-1లో హెచ్ఎస్ ప్రణరు రారు 20-22, 14-21తో విదిత్ శరణ్(థారులాండ్) చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఆ తర్వాత పురుషుల డబుల్స్‌లో చిరాగ్-సాత్విక్ జంట 21-19, 19-21, 21-12తో సుప్రమ్-తీరరస్టకుల్‌పై గెలిచారు. దీంతో స్కోర్ 1-1తో సమమైంది. ఆ తర్వాత సింగిల్స్-2లో లక్ష్యసేన్ 21-12,

19-21, 21-16తో తీరరస్టుకుల్‌పై గెలిచి భారత్‌కు 2-1 ఆధిక్యతను సంపాదించిపెట్టాడు. ఆ తర్వాత పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్-ధృవ్ కపిల 21-19, 21-15తో, మూడో సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-9, 21-5తో శరణ్ జస్రీని చిత్తుచేయడంతో భారత్ 4-1తో విజయం సాధించింది. 29న భారత పురుషుల జట్టు ఇంగ్లండ్‌తో, మే 1న ఇండోనేషియాతో తలపడనుంది. ఉబెర్‌కప్‌లోనూ భారత్ సునాయాసంగానే కెనడాను చిత్తుచేసింది. గ్రూప్ఎలో భాగంగా జరిగిన మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్ అస్మిత చాలీహా 26-24, 24-22తో స్టార్ షట్లర్ మిచ్చెలిని చిత్తుచేసి భారత్‌కు 1-0 ఆధిక్యతలో నిలిపింది. మహిళల డబుల్స్‌లో ప్రియాస్మృతి 21-12, 21-10తో, రెండో సింగిల్స్‌లో ఈషారాణి 21-13, 21-12తో వెన్ యును చిత్తుచేసి భారత్‌కు 30 ఆధిక్యతలో నిలిపారు. మహిళల రెండో డబుల్స్‌లో సిమ్రన్ సింఘ్రిరితిక 19-21, 15-21తో ఓటమిపాలవ్వగా.. మూడో, చివరి సింగిల్స్‌లో అన్మోల్ కర్బ్ 21-15, 21-11తో ఎలీనా జంగ్‌పై గెలిచి భారత్‌కు 4-1 ఆధిక్యతను చేకూర్చారు. నేడు ఉబెర్ కప్‌లో మహిళల జట్టు సింగపూర్‌తో తలపడనుంది. 30న చైనాతో తలపడనుంది.

## ఆ విషయాలకు దూరంగా ఉన్నాను



**జై భీమ్ న్యూస్, సినిమా :**
సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకోవడానికి హీరోయిన్లు అహర్నిశలు కష్టపడుతూ ఉంటారు. అయితే అవకాశం అనేది ఒకసారి మాత్రమే వస్తుంది కాబట్టి సినిమాల సెలెక్షన్ లో హీరోయిన్లు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ ముందుకు సాగాలి. ఒక్కసారి స్టార్ డమ్ వచ్చింది అంటే దాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తూ ముందుకెళ్లాలి. ఇక ఇది ఇలా ఉంటే హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'సీతారామం ' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన 'మృణాల్ ఠాకూర్' వరుస సినిమాలు చేస్తూ ముందుకు దూసుకెళ్తుంది.అయితే సీతారామం సినిమా సక్సెస్ అవ్వడంతో ఆమెకు భారీ ఆఫర్లు అయితే వచ్చాయి. కానీ వాటిలో ఆమె సెలెక్టెడ్ గా సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఇక మొత్తానికైతే ప్రస్తుతం చాలా ఆక్టివ్ గా ఉంటూ తెలుగు సినిమాలలో హీరోయిన్ గా చేస్తోంది. ఇక రీసెంట్ వచ్చిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా అనుకున్న మేరకు సక్సెస్ సాధించలేదు. అయినా కూడా ఆమె ఇప్పుడు మరికొన్ని సినిమాల్లో బిజీ అయింది. ఇక రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూ లో పాల్గొన్న ఆమె ఇప్పటికే చాలా సినిమాల్లో అవకాశాలను కోల్పోయానని చెప్పింది. ఎందుకంటే వాళ్ళ పేరెంట్స్ కి ముద్దు సీన్లు,రొమాంటిక్ సీన్లు నచ్చవనే ఉద్దేశ్యంతో తను అలాంటి సీన్లు ఉన్న సినిమాలు చేయకూడదని నియమం పెట్టుకుందట. ఎందుకంటే తను అలాంటి సీన్లలో నటిస్తే వాళ్ళ పేరెంట్స్ తనని ఎలా చూస్తారని భయపడేదట. కానీ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ గా ఉన్నప్పుడు ఇవన్నీ వృత్తిలో భాగమే అని తర్వాత తెలుసుకుందట. ఇక దాంతో వాళ్ల పేరెంట్స్ కి అర్థమయ్యే విధంగా చెప్పిందట.

## 'ప్రియదర్శి' లేటెస్ట్ అప్డేట్



**జై భీమ్ న్యూస్, సినిమా :**
టాలీవుడ్ ఇండస్ట్రీ లో ప్రస్తుతం ప్రియదర్శి ఫుల్ జోష్‌లో కెరియర్ నీ ముందుకు సాగిస్తున్నాడు. ఈయన కెరియర్ ప్రారంభంలో ఎన్నో సినిమాల్లో చిన్న చిన్న పాత్రలో నటించి మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు.ఇకపోతే ఈయన ఈ మధ్య కాలంలో సినిమాల్లో ముఖ్య పాత్రాల్లో నటించడం కంటే కూడా హీరోగా ఎక్కువగా నటిస్తూ వస్తున్నాడు. అందులో భాగంగా పోయిన సంవత్సరం ఈయన వేణు దర్శకత్వంలో బలగం అనే సినిమాలో హీరో గా నటించాడు. ఈ మూవీ పెద్దగా అంచనాలు లేకుండా విడుదల అయ్యి బాక్స్ ఆఫీస్ దగ్గర సూపర్ సాలిడ్ విజయాన్ని అందుకుంది. ఈ మూవీ తో హీరో గా ప్రియదర్శి క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. దానితో ప్రస్తుతం ఈయన అనేక సినిమాల్లో హీరోగా నటిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితమే ప్రియదర్శి హీరోగా నబా నటేష్ హీరోయిన్ గా డార్లింగ్ అనే మూవీ అనౌన్స్ అయిన విషయం మన అందరికీ తెలిసిందే. ఇక తాజాగా ఈ రోజు ప్రియదర్శి మరో మూవీ కి సంబంధించిన అప్డేట్ కూడా బయటకు వచ్చింది. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి అలాగే జాన్వీ నారంగ్ కాంబినేషన్ లో ఓ సినిమా చేస్తున్నట్టుగా తాజాగా కన్ఫర్మ్ అయ్యింది. స్పిరిట్ మీడియా ... ఎస్ వి ఏ సి ఎల్ ఎల్ పి వారి సమర్పణలో ఈ మూవీ రూపొందబోతుంది. ఈ మూవీ కి సంబంధించిన మరిన్ని వివరాలు మరికొన్ని రోజుల్లోనే బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ రెండు మూవీ లలో మాత్రమే కాకుండా ప్రియదర్శి ప్రస్తుతం ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న ఓ మూవీలో కూడా హీరోగా నటిస్తున్నాడు. ఇలా ప్రస్తుతం ప్రియదర్శి మూడు సినిమాల్లో హీరోగా నటిస్తూ ఫుల్ బిజీగా కెరియర్ ను ముందుకు సాగిస్తున్నాడు.

# అంచనాలు పెంచుకుంటున్న రజినీ ఫ్యాన్స్?

**జై భీమ్ న్యూస్, సినిమా :**
జైలర్ మూవీతో తిరిగి సూపర్ ఫాంలోకి వచ్చిన సూపర్ స్టార్రజినీకాంత్ తన తరువాత సినిమా కూలీతో డబుల్ ఎనర్జీతో కనిపిస్తున్నారు. లోకేష్ కనకరాజ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న కూలీ మూవీ నుంచి రీసెంట్ గా వచ్చిన టీజర్ చూస్తే రజినీ కాంత్ తో లోకేష్ కనగరాజ్ మరో సూపర్ హిట్ ఇచ్చేందుకు రెడీగా ఉన్నాడని అనిప స్తుంది.లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ తో ముడిపడే ఈ కూలీ సినిమా ఉంటుందా లేదా అన్నది తెలియాల్సి ఉంది. అయితే లోకేష్సినిమా అనే విషయం పక్కన పెడితే కూలీ సినిమా మీద జైలర్ ఇంపాక్ట్ ఎంత వరకు ఉంటుంది అని సూపర్ స్టార్రజినీ కాంత్ ఫ్యాన్స్ ఎగ్జైట్ అవుతున్నారు.ఒక స్టార్ హీరోసినిమా సూపర్ హిట్ పడితే ఆ సినిమాకి సంబంధించి ఇంపాక్ట్ అనేది తరువాత సినిమా మీద ఉంటుంది. జైలర్ మూవీతో నెల్సన్ సూపర్ స్టార్ ఫ్యాన్స్ ఆయన్ను ఎలా చూడాలని అనుకుంటు



న్నారో అలా చూపించాడు. జైలర్ మూవీరజినీకాంత్ ఫ్యాన్స్ ఆకలి తీర్చేసింది. అయితే ఆ తర్వాత కూలీగా వస్తున్న లోకేష్ కనగరాజ్ రజినీ కాంత్ ని డిఫరెంట్ గా చూపించే ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. జైలర్ మూవీతో రజినీ మేనరిజం స్టైల్ మొత్తం వాడేశాడు నెల్సన్.కాబట్టి లోకేష్ చేస్తే ఏదైనా కొత్తగా చేయాల్సి ఉంటుంది. అయితే కూలీ సినిమా టీజర్ చూసిన ఆడియన్స్ ఇది లోకేష్ రెగ్యులర్ కమర్షి యల్ సినిమా లాగా ఉందని చెబుతున్నా రు. ప్రస్తుతం రజినీకాంత్ నటిస్తున్న వేటయ్యన్ ఈ దసరాకి విడుదల కాబో తుంది. ఆ సినిమా తర్వాత లోకేష్ కనగరాజ్ తో చేస్తున్న కూలీ వస్తుంది. కూలీ సినిమా టీజర్ లో జైలర్ రిఫరెన్స్ లు బాగా కనిపిస్తున్నాయి. లోకేష్ ఈ విషయంలో జాగ్రత్త పడకపోతే మాత్రం కూలీ కాదు ఇది జైలర్ 2 సినిమా అని అనుకుంటారు.ఇక కూలీ సినిమా గోల్డ్ మాఫియా బ్యాక్ డ్రాప్ తో భారీ యాక్షన్ సినిమాగా వస్తుందని అర్థమవుతుంది. ఇంకా అంతేకాదు రజినీ ఒకప్పటి డైలాగ్ ని మళ్లీ ఈ మూవీలో పెట్టి సర్ ప్రైజ్ చేశాడు.

# ఆ వయసు వచ్చాకే పెళ్లి చేసుకుంటా

**జై భీమ్ న్యూస్, సినిమా :**
జాతి రత్నాలు సినిమాలో చిట్టి పాత్రలో నటించి అద్భుతమైన విజయాన్ని సూపర్ క్రేజ్ ను సంపాదించుకున్న పరియ అబ్దుల్లా తాజాగా ఓ ఇంటర్వ్యూ లో పాల్గొంది.అందులో భాగంగా ఈమె పెళ్లి గురించి అనేక ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చింది. తాజా ఇంటర్వ్యూ లో భాగంగా ఈ బ్యూటీ మాట్లాడుతూ ... పెళ్లి విషయంలో నాకు కొన్ని ఖచ్చితమైన నిర్ణయాలు ఉన్నాయి. నేను కచ్చితంగా 30 సంవత్సరాలు దాటిన తర్వాతే పెళ్లి చేసుకుందాం అని డిసైడ్ అయ్యాను. అలాగే నేను పెద్దలు కుదిరిచిన పెళ్లి కాకుండా ప్రేమ వివాహం చేసుకుంటాను. ఎందుకు అంటే ప్రేమ ద్వారానే అవతలి వ్యక్తి గురించి అన్ని విషయాలు తెలుసుకోవచ్చు. అలా అయితేనే మన జీవితం ఎంతో ఆనందంగా ఉంటుంది. అందుకే ప్రేమించిన వ్యక్తినే పెళ్లి చేసుకుంటాను అని ఈ బ్యూటీ చెప్పుకొచ్చింది. ఇకపోతే తాజాగా ఈమె అల్లరి నరేష్ హీరో గా రూపొందిన ఆ ఒక్కటి అడక్కు అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. చాలా సంవత్సరాల తర్వాత అల్లరి నరేష్ నటించిన ఫుల్ లెన్త్ కామెడీ ఎంటర్టైనర్ మూవీ కావడంతో ఈ సినిమాపై తెలుగు సినీ ప్రేమికులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఈ మూవీ మే 3 వ తేదీన థియేటర్ లలో విడుదల కానుంది. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రస్తుతం ఈ మూవీ యూనిట్ వరస ఇంటర్వ్యూ లలో , టీవీ షో లలో పాల్గొంటూ ఈ మూవీ ని ప్రమోట్ చేస్తూ వస్తున్నారు. ఇకపోతే ఫరియా కూడా జాతి రత్నాలు మూవీ తర్వాత అనేక సినిమాలలో



నటించినప్పటికీ ఏ మూవీ కూడా ఆ స్థాయి విజయాన్ని అందుకోలేదు. దానితో ఈ బ్యూటీ కూడా ఈ సినిమాపై బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. మరి ఈ సినిమా ఫెరియా కి ఏ స్థాయి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# అవి నా జీవితంలో చీకటి రోజులు..!




**జై భీమ్ న్యూస్, సినిమా :**
ఇండియాలో అద్భుతమైన క్రేజ్ కలిగిన హీరోయిన్ లలో ఒకరు అయినటు వంటి ప్రియాంక చోప్రా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈమె ఇప్పటి వరకు ఎన్నో సినిమాలలో హీరోయిన్ గా ఇతర పాత్రలో నటించి ఇండియా వ్యాప్తంగా గుర్తింపును సంపా దించుకుంది.అలాగే ఇండియాలో స్టార్ హీరోయిన్ గా కెరియర్ ను కొనసాగిస్తున్న సమయం లోనే ఈమె హాలీవుడ్ ఇండస్ట్రీ వైపు అడుగులు వేసింది.ఇక హాలీవుడ్ లో కూడా ఇప్పటికే ఎన్నో సినిమాలలో నటించి అందులో కొన్ని మూవీ లతో అద్భుతమైన విజయాలను అందుకొని ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును సంపాదించుకుంది. ఇది ఇలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ ఓ ఇంటర్వ్యూ లో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూలో భాగంగా ఈమె హాలీవుడ్ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చిన ప్రారంభంలో ఆమె ఎదుర్కొన్న కష్టాలు గురించి , ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి అనే వాటి గురించి క్లియర్ గా చెప్పుకొచ్చింది. తాజా ఇంటర్వ్యూ లో ప్రియాంక చోప్రా మాట్లాడుతూ ... హాలీవుడ్ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చిన తొలి దశలో చీకటి రోజులను అనుభవించాను. హాలీవుడ్ ఇండస్ట్రీ కి వెళ్లిన కొత్తలో చాలా భయం వేసింది. నాకు అక్కడ తెలిసిన వారు ఎవరూ లేకపోవడంతో చాలా ఒంటరిగా ఫీల్ అయ్యాను. అది ఒక చీకటి అధ్యా యంగా మిగిలిపోయింది. ఇండియాలో నేను స్టార్ హీరోయిన్ అయినా కూడా హాలీవుడ్ లో కెరియర్ను మళ్ళీ మొదటి నుంచి స్టార్ట్ చేయవలసి వచ్చింది. అలాంటి సమయం లోనే నా పనిని నేను చేసుకుంటూ వెళ్లాను చివరగా హాలీవుడ్ లో కూడా సక్సెస్ అయ్యాను అని చెప్పుకొచ్చి ంది. ఇకపోతే హాలీవుడ్ లో సక్సెస్ అయిన ఈ బ్యూటీ కి ప్రస్తుతం ఇండియన్స్ సినీ పరిశ్రమలో కూడా మంచి క్రేజీ సినిమా అవకాశాలు దక్కుతున్నాయి.

# భక్తిలో మునిగి తేలుతున్న సంయుక్త

**జై భీమ్ న్యూస్, సినిమా :**
భీమ్లానాయక్‌తో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది సంయుక్త మీనన్. పవన్ కళ్యాణ్, రానా హీరోలుగా నటించిన ఈ లో రానాకు జోడిగా నటించి మెప్పించింది సంయుక్త మీనన్.భీమ్లానాయక్ తో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది సంయుక్త మీనన్. పవన్ కళ్యాణ్, రానా హీరోలుగా నటించిన ఈ లో రానాకు జోడిగా నటించి మెప్పించింది సంయుక్త మీనన్.'తీవండి' అనే మలయాళ తో ఇండస్ట్రీలోకి వచ్చింది ఈ చిన్నది. ఆతర్వాత అక్కడ పలు ల్లో నటించింది. ఆ తర్వాత భీమ్లానాయక్ లో ఛాన్స్ అందుకుంది. ఈ తో మంచి విజయాన్ని అందుకుంది.ఆ తర్వాత కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసార లో నటించింది ఈ కూడా సూపర్ హిట్ అందుకుంది. అలాగే సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన విరూపాక్ష తో మరో హిట్ అందుకు ంది. ఇంకా హ్యాట్రిక్ హిట్ అందుకున్న ఈ బ్యూటీ తమిళ్ స్టార్ హీరో ధనుష్ తో కలిసి నటించింది. సార్ లో హీరో యిన్‌గా చేసింది. ఈ కూడా సూపర్ హిట్ గా నిలిచింది. ఆ తర్వాత డెవిల్ అనే చేసింది. ఈ ఫ్లాప్ అయ్యింది. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ చిన్నది లకు గ్యాప్ ఇచ్చింది. ఆచితూచిలు చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఆధ్యాత్మిక బాటలోకి అడుగు పెట్టింది. సంయుక్త ఓ పురాతన ఆలయాన్ని సందర్శించింది. అక్కడ దిగిన కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంది .



## థైరాయిడ్ సమస్య ఎందుకు వస్తుంది..?



**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

థైరాయిడ్ అనేది ప్రస్తుత రోజుల్లో ఒక సాధారణ సమస్యగా మారింది. ఈ సమస్యపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయి. థైరాయిడ్ పూర్తిగా నయం అవుతుందా..? దానిని ఎలా నివారించాలి వంటి తరచూగా ప్రజల్లో ఎదురయ్యే సందేహాలు.అయితే, థైరాయిడ్ గ్రంధి సరిగ్గా పని చేయనప్పుడు, అది ఉత్పత్తి చేసే థైరాయిడ్ హార్మోన్ చాలా ఎక్కువ లేదా చాలా తక్కువగా ఉంటుంది.. అటువంటి పరిస్థితిలో, థైరాయిడ్ సమస్య ఏర్పడుతుంది. థైరాయిడ్‌తో బాధపడే వ్యక్తి వేగంగా బరువు కోల్పోతారు. థైరాయిడ్‌తో బాధపడేవారు ఆహారం, తీసుకునే పానీయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లైఫ్‌స్టైల్‌తో థైరాయిడ్ పూర్తిగా నయం అవుతుందా..? లేదంటే, దానిని ఎలా నివారించాలి అనే ప్రశ్నలకు సమాధానం ఇక్కడ తెలుసుకుందాం.. థైరాయిడ్‌ను పూర్తిగా నయం చేయలేము. కానీ, మందులు, జీవనశైలి మార్పుల సహాయంతో దీనిని నియంత్రించవచ్చు. థైరాయిడ్ బాధితులు ఒత్తిడికి దూరంగా ఉండాలి. మానసిక, శారీరక ఒత్తిడి మీ శరీరంలో మంటను పెంచుతుంది. ఒత్తిడిని తొలగించుకోవడానికి ధ్యానం అలవాటు చేసుకోండి. మంచి పోషకాహారం తీసుకోవటం తప్పనిసరి. మీ ఆహారంలో తగినంత కాల్షియం, ప్రోటీన్, అయోడిన్, మెగ్నీషియం ఉండటం వల్ల మీ థైరాయిడ్ పనితీరు మెరుగ్గా ఉంటుంది. ఇది కాకుండా, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు విటమిన్ ఎ, బి మరియు సి అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి. రోజూ వ్యాయామం చేయడం ద్వారా థైరాయిడ్‌ను నియంత్రించవచ్చు. రోజువారీ తేలికపాటి వ్యాయామ దినచర్య ఒత్తిడిని తగ్గిస్తుంది. శరీరం జీవక్రియను మెరుగుపరుస్తుంది. ఇది మీ థైరాయిడ్ రుగ్మతలను మెరుగుపరుస్తుంది. మీ బరువును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

## ఎండు ద్రాక్షను ప్రయోజనాలు



**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

ప్రతిరోజూ మీ ఆహారంలో తప్పనిసరిగా డ్రై ఫ్రూట్స్ చేర్చుకోవాలి. ఇది మీ శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడంలో ఉపయోగకరంగా ఉంటుంది. డ్రైఫ్రూట్స్‌లో ఒకటి ఎండుద్రాక్ష.. ఇది మంచి హెల్తీ ప్రోటీన్ నిది. ఇది అనేక విటమిన్లు, డైటరీ ఫైబర్, పొటాషియం వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉంటుంది. ఎండుద్రాక్షలో ఉండే పోషకాలు శరీరానికి వ్యాధులతో పోరాడే శక్తిని అందించి వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అయితే ఎండుద్రాక్షలను రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియదు.. 10 ఎండుద్రాక్షలను రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు మరింత రెట్టింపు అవుతాయి. అది తెలిస్తే వెంటనే మొదలుపెట్టేస్తారు..ఎండు ద్రాక్ష నీరు తాగితే అద్భుతమైన లాభాలు కలుగుతాయంటున్నారు డైటీషియన్లు.. ఎండుద్రాక్ష నీరు తాగడం వల్ల శరీరం డిటాక్స్‌ఫై అవుతుంది. ఎండుద్రాక్ష నీటిలో ఎక్కువ ఫైబర్ ఉంటుంది. మీ పొట్టను ఆరోగ్యంగా ఉంచడం ద్వారా సరైన జీర్ణక్రియను నిర్వహించడంలో ఇది మీకు సహాయపడుతుంది. ఫైబర్‌తో పాటుగా న్యూట్రీషియన్స్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలోని కొలెస్ట్రాల్ లెవల్స్ ను కంట్రోల్లో ఉంచి గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది మీ శరీరంలో రక్తం కొరతను నివారిస్తుంది. ఎండుద్రాక్షలో ఐరన్, బి-కాంప్లెక్స్ విటమిన్లు, రాగి పుష్కలంగా ఉంటాయి. రక్త కణాలను పెంచడంలో ఐరన్ మీకు అతి ముఖ్యమైనది. చాలా మందికి కొంచెం తిన్న వెంటనే ఎసిడిటీ వస్తుంది. అలాంటి వారికి ఎండుద్రాక్ష నీటిని తాగటం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది. యాంటాసిడ్, పొటాషియం, మెగ్నీషియం వంటివి ఈ నీటిలో ఉన్నాయి. ఉదర ఆమ్లాన్ని నయం చేయడం ద్వారా మీకు ఎసిడిటీ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

# దిండు లేకుండా నిద్రపోండి..!

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

రాత్రిపూట 7 నుండి 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలని మనందరికీ తెలుసు. ఇది మన శరీర పనితీరు సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. నిద్రలేమి ఉంటే, బద్ధకం, అనేక సమస్యలను ఎదుర్కొంటారు. కానీ ఇలాంటి సమస్య దీర్ఘకాలంలో పెను ముప్పుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. కొన్ని చిన్న అలవాట్లు మన జీవితంలో పెను మార్పును తెస్తాయి. అలాంటి అలవాటు ఒకటి ఏంటంటే.. రాత్రిపూట దిండు లేకుండా నిద్రపోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయంటున్నారు నిపుణులు. మీరు దిండును పూర్తిగా వదులుకోలేకపోతే, మీ దిండు సన్నగా ఉండేలా చూసుకోండి. ఇది మీకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. తప్పనిసరిగా దిండు వేసుకుని పడుకునే వారిలో కొన్ని రకాల చర్మ సమస్యలు కూడా వస్తాయి. అందులో ముఖ్యంగా ముఖంపై మొటిమలు వస్తాయంటున్నారు నిపుణులు. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల మొటిమలు రాకుండా నిరోధించవచ్చునని చెబుతున్నారు. దిండుపై పడుకున్నప్పుడు.. మీ ముఖం దిండుకు అంటుకుని ఉంటుంది. ఇది మీ ముఖంపై బ్యాక్టీరియా, మురికిని వ్యాపింపజేస్తుంది. ఇలాంటప్పుడు ముఖంపై



మొటిమలు వచ్చే అవకాశం ఉంది. మొటిమలే కాకుండా ముఖంపై ముడతలు కూడా కలిగిస్తుంది. చర్మాన్ని సంరక్షించుకోవాలనుకునే వారు దిండు లేకుండా నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల మీ ఒత్తిడి స్థాయి తగ్గుతుంది. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల మీ నిద్ర నాణ్యత మెరుగుపడుతుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. దిండు లేకుండా నిద్రపోవడం వల్ల నిద్రలేమి వంటి నిద్ర సంబంధిత సమస్యలు తలెత్తకుండా ఉంటుంది. మీకు కూడా దిండు వేసుకుని పడుకునే అలవాటు ఉంటే, మీ తల చాలా ఎత్తుగా కాకుండా.. చాలా చిన్న పాటి దిండును వాడుకునేలా అలవాటు చేసుకోండి. చాలా ఎత్తుగా ఉన్న దిండును వాడటం వల్ల మెడ, వెన్నెముకలో నొప్పిని భరించాల్సి వస్తుంది. మీరు దిండు లేకుండా నిద్రపోతున్నప్పుడు మీ వెన్నెముక నిటారుగా ఉంటుంది. తల కింద దింటు ఉంటే వెన్నెముక మీద ప్రభావం పడుతుంది. మీరు కూడా ఇలాంటి సమస్యను ఎదుర్కొంటూనే ఉండి ఉంటారు. ఒకసారి గమనించుకోండి.

# దాల్చిన చెక్కతో ఈ సమస్యలకు చెక్..



**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

ప్రస్తుత యుగంలో అనేక వ్యాధులకు మూలం తినే ఆహార పదార్థాలు. ఇన్‌స్టెంట్ ఫుడ్‌తో శరీర బరువు పెరిగిపోతుంది. ఇవే అనేక సమస్యలకు కారణం అవుతుంది. దీనిని ఊబకాయం లేదా ఒబెసిటీ అంటారు. ఈ వ్యాధి గ్రస్తులు దాల్చిన చెక్క నీటిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో శరీరంలోని కొవ్వును కరిగించే మూలకాలు ఉంటాయి. దాల్చిన చెక్క పొడి బయట మార్కెట్లలో దొరుకుతుంది. కల్తీ లేకుండా చూసి తీసుకోవాలి. లేదా ఇంట్లో మిక్సర్ చేసుకోవచ్చు. ప్రతి రోజూ ఒక టేబుల్ స్పూన్ దాల్చిన చెక్క పౌడర్ ను గ్లాసు నీటిలో మరిగించి కషాయంలా సేవిస్తే జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. దాల్చిన చెక్క ఆకలిని నియంత్రించడమే కాకుండా.. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేసే హార్మోన్ ఇన్సులిన్‌గా పనిచేస్తుంది. దాల్చినచెక్కను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.దీంట్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీంలోని మలినాలను బయటకు పంపుతాయి. దాల్చిన నీరు తాగడం వల్ల శరీరం మెటబాలిజం పెరుగుతుంది. దీంతో వెయిట్ లాస్ అయ్యేందుకు చక్కగా పని చేస్తుంది. దాల్చిన చెక్కలో అనేక యాంటీ ఇన్‌ఫ్లమేటరీలు ఉంటాయి. ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను చెక్ పెడుతుంది. మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. సాధారణ జలుబు, ఫ్లూ, వార్మ్ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ఫుడ్ పాయిజనింగ్ వంటి ఇన్ఫెక్షన్లను మన దగ్గరకు రాకుండా ప్రయోజనం చేకూరుస్తుంది.

# ఈ చెట్టు ఆరోగ్య ప్రయోజనాలు

**జై భీమ్ న్యూస్, ఆరోగ్యం:**

గోల్డెన్ షవర్ (రేల చెట్టు)... బంగారు వర్ణంలో ఉండే ఈ చెట్టు పూలు చూసేందుకు కనువిందుగా ఉంటుంది. ఔషధ ప్రయోజనాలు పుష్కలంగా కలిగి ఉంటుందని ఆయుర్వేదం స్పష్టం చేస్తుంది. దీని ఆకుల నుండి మూలాల వరకు అనేక వ్యాధులకు ఆయుర్వేదంలో ఔషధంగా గోల్డెన్ షవర్‌ను ఉపయోగిస్తారు. ఈ చెట్టు వేరు, పువ్వు, ఆకు, బెరడు, అన్నీ ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. ఇది అనేక రకాలైన చర్మ వ్యాధులకు చికిత్సలో ఉపయోగిస్తారు., శరీర శక్తిని పెంచడానికి ఇది మంచిది. సోరియాసిస్‌ను నయం చేస్తుంది. సెల్ ఉపరితలాలపై పేరుకుపోయిన టాక్సిన్స్‌ను తొలగించడంలో కూడా ఇది అద్భుతంగా ఉపయోగపడుతుంది. రేల చెట్టుతో అల్సర్లు, కణితులు, గౌట్, రుమాటిజం, గుండె జబ్బులు, కామెర్లు వంటి వ్యాధులకు కూడా ఔషధంగా ఉపయోగిస్తారు. రేల కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, విషపూరిత



జంతువుల కాటు వల్ల కలిగే ద్రవం, నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. ప్రేగు సంబంధిత వ్యాధులు, జ్వరం, కుష్టు వ్యాధి, మధుమేహం చికిత్సకు కూడా ఉపయోగిస్తారు. రేల చెట్టు బెరడును తురిమి పౌడర్‌గా చేసుకుని పుండ్లు, వాపు ఉన్న చోట పూయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రేల చెట్టు ఆకులను మెత్తగా నూరి మజ్జిగలో కలిపి తాగితే ఊబకాయం తగ్గుతుంది. పువ్వు కషాయం గుండెల్లో మంట, కడుపు పూతలకి కూడా మంచిదని నమ్ముతారు. పువ్వు కషాయం గుండెల్లో మంట, కడుపు పూతలకి కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. గోల్డెన్ షవర్ ట్రీ ఆకుల రసం తీసుకోవడం వల్ల షుగర్ అదుపులో ఉంటుంది. ఇదీ కాకుండా రేల పువ్వుల వినియోగం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది.నిపుణుల అభిప్రాయం ప్రకారం,

రేల ఆకులను బాగా కడిగి ఆపై దానిని మెత్తగా మిక్సీ పట్టుకుని దాని రసం తీయండి. ఈ రసాన్ని రోజూ నాల్గవ కప్పు పరిమాణంలో తీసుకోండి. ఇలా చేస్తూ క్రమంగా బ్లడ్ షుగర్ నియంత్రలో ఉంటుంది. కొంతమంది దీనిని టీ రూపంలో కూడా తీసుకుంటారు.